ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఏప్రిల్ 6, 2008

ఉగాది ఊసులు

హ్యాపీ బర్త్‌డే

(2008 ఏప్రిల్-6 నుంచి 2008 ఏప్రిల్-12 వరకు)

టి. భవ్యశ్రీ
ఏప్రిల్-10
రుషికళ-పవన్ కుమార్
జనప్రియ-బాలాపూర్-హైదరాబాద్

వి.రిఖిల్ (చందు)
ఏప్రిల్
భారతి-శ్రీనివాసరావు
మహరాణిపేట-విశాఖపట్నం

కె. రమాదేవి
ఏప్రిల్
ఆశాలత-కె.వి.ఎం. చారి
సూర్యాపేట-నల్గొండ

టి. సుమంత్ (చిన్ను)
ఏప్రిల్-10
పద్మ-వీరారెడ్డి
విద్యానగర్-నల్గొండ

వి. ప్రగతి
ఏప్రిల్-5
దివ్య-గంగరాజు
రైల్వేకాలనీ-2 క్రాస్- తిరుపతి

ఆర్. వంశీకృష్ణ
ఏప్రిల్
భారతి-గురుప్రసాద్
కర్నూలు

ఆర్. భవ్య
ఏప్రిల్
భారతి-గురుప్రసాద్
కర్నూలు

యేకాశి దిలీప్ కమార్
ఏప్రిల్-6
మరియమ్మ-జోసఫ్
నంద్యాల-కడప

ఎస్‌డిఎస్ కిరణ్మయి (చిన్ని)
ఏప్రిల్-7
జ్యోతి-బాలు



వినిమయ సంస్కృతి నుంచి తక్షణమే బయటపడాలి

మన అతిథి

పేరు	:	మేడిపల్లి రవికుమార్
తల్లిదండ్రులు	:	శ్రీరాములు, రాఘవమ్మ
పుట్టిన స్థలం	:	ప్రకాశం జిల్లా, అద్దంకి
పెరిగినది	:	కృష్ణాజిల్లా, విస్సన్నపేట
పుట్టిన తేదీ	:	10-07-1960
చదువు	:	ఎంఏ, ఎంఫిల్, పిహెచ్‌డి
ఉద్యోగం	:	ఎస్‌వి యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ (తెలుగు విభాగం)
ప్రవృత్తి	:	ప్రజా సాహిత్యం, సామాజిక విమర్శ
రచనలు	:	కవన కథనం (సాహితీ రూపకం), కేంద్ర సాహిత్య అకాడమీలో ఆరుద్ర గురించి మోనోగ్రాఫ్ (27 భాషల్లో అనువదించారు)
సాహిత్య ఉపన్యాసాలు	:	164 (దేశవ్యాప్తంగా)
గుర్తింపు	:	సాహితీ విమర్శకులుగా ప్రజాభిమానం, ప్రముఖ రచయిత ఆరుద్ర వద్ద 13 ఏళ్ళపాటు శిష్యరికం, దత్తపుత్రునిగా ఆ కుటుంబంతో సాన్నిహిత్యం
కళలు	:	ప్రజాసాహిత్యం,కళలపై సాంఘిక జీవితాలకు సంబంధించి ఉపన్యాసాలు
ఇష్టపడేది	:	నిరంతరం అధ్యయనం చేయడం. కష్టమైనా ఇష్టంగా చేయడం.
ఇష్టపడనిది	:	అనవసరంగా మాట్లాడడం, కాలం వృధా చేయడం
లక్ష్యం	:	ప్రజలతో మమేకమై ఉండడం, సాహిత్యాన్ని అందరికీ అందించడం

ప్రపంచీకరణ నేపథ్యంలో మార్కెట్ సంస్కృతి సమాజంపై పడింది. ప్రజావళి అంతా మార్కెట్ సంస్కృతికి బానిసయ్యింది. ప్రజలు గతంలో అవసరాల కోసం వస్తువులను కొనేవారు. ప్రస్తుతం వస్తువుల కోసం అవసరాలను మలచుకుంటున్నారు. వస్తు వ్యామోహం, వినిమయ సంస్కృతి నుండి తక్షణమే బయటపడాల్సిన అవసరం ఉంది. అపుడే మెరుగైన సమాజం సాధ్యం.

మేడిపల్లి రవికుమార్

ఈ సంచికలో....

టపా ... 2
ఆరోగ్యం ... 5
సీరియల్ ... 8
సినిమా ... 10
మనసా... తెలుసా ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14

ఇంకా...



మంచిపుస్తకం ...6
ఆదివాసుల్లో అగ్నికణం అక్క సమర స్మృతులు

విజ్ఞాన వీచిక ... 4
పద్ధతి మార్చుకుందాం

లాహిరి లాహిరిలో ... 20
రుచి ... 22
సలహాలు ... 23
కొత్త పుస్తకాలు ... 24

కథ ... 18
రుణం



మంచి కథ

ఈ వారం స్నేహలో ప్రచురించిన కథ 'కతలొద్దు' చాలా బాగుంది. మనం రోజూ చూస్తూనే ఉంటాము. బస్టాండులో, రోడ్డు మీద చంకలో చంటి బిడ్డలను ఎత్తుకుని, 'బాబుగారు, అర్ధరూపాయి ధర్మం చేయండి బాబు, బిడ్డకి ఆకలి వేస్తోంది. పాలు లేవు అమ్మగారు" అని భిక్షమెత్తుకొంటూ కనిపిస్తారు. అప్పుడు వాళ్లని చూసినప్పుడు మనకు కళ్లలో నీళ్లు తిరుగుతుంటాయి. మనకు చేతనైతే సాయం చెయ్యాలి. ఆకలి తీర్చాలి. అంతేగాని, వాళ్లని చులకనగా చూడకూడదు. చూడండి ఇక్కడ వాచ్‌మెన్ కర్ర తీసుకొని కొట్టడానికి వెంబడించాడు పాపం. ఆ భిక్షగత్తె శ్వాస విడిచి ఆ బిడ్డని అనాథను చేసి వెళ్ళిపోయింది. ఆ పిల్లవాడి గొంతు ఎవ్వరికీ వినిపించలేదా. అక్కడ అంత మంది ఉన్నా ఎవరికి వాళ్ళు మనకెందుకులే అన్నట్టు ఉన్నారు. అదే తప్పు! ఎక్కడుంది? మానవత్వం? ఇంత చక్కటి కథ అందించినందుకు అభినందనలు. ఇంకా మంచి కథలు అందించాలని కోరుకుంటున్నాను.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

భగత్ ఆదర్శనీయుడు

ఇంక్విలాబ్ జిందాబాద్! అంటూ 23 సంవత్సరాల వయస్సులోనే స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఉరికంబ మెక్కిన భగత్‌సింగ్ గురించి మాకు తెలియని ఎన్నో విషయాలను స్నేహలో అందించారు. అతడికి ఉన్న ధైర్య సాహసాలు, పట్టుదల, పుస్తక పఠనం మొదలగునవి నేటి యువతకు కూడా ఎంతో ఆదర్శనీయమైనవి. అలాగే 'చూద్దామా' శీర్షికలో ఆగ్రాలోని తాజ్‌మహల్ కోట ఉద్యానవనాలు మొదలైన వాటిని గురించి సవివరంగా తెలుసుకున్నాం. లాహిరి లాహిరి శీర్షికలో దొంగ రాముడు చిత్ర నిర్మాణానికి కారణమైన సంఘటనలనూ, నిర్మాణ విశేషాలను తెలుసుకున్నాం. త్వరలో అంతరిక్షంలోకి అడుగుపెట్టడానికి చేస్తున్న వియత్నాం ఉపగ్రహ ప్రయోగం విజయవంతమవ్వాలని ఆకాంక్షిస్తు న్నాము.

గొల్లమండల సురేష్‌కుమార్,
సీతారాంపురం, ఖమ్మం.

చక్కని శైలిలో వస్తున్న 'వీచిక'

'ఇంక్విలాబ్ జిందాబాద్' వ్యాసం బావుంది. 'భగత్‌సింగ్ పుట్టినదే స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబంలో...' అంటూ భగత్‌సింగ్ జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్లుగా అట్టమీది కథలో వివరించారు. స్వాతంత్ర్యోద్యమం గురించి ఎన్ని సార్లు తెలుసుకున్నా మనిషిలో సేవా దృక్పథం లేకుంటే వ్యర్థమౌతుంది. భగత్‌సింగ్ జీవిత చరిత్రను చదివి నప్పుడు నిజంగా నాకు తెలియకుండానే పిడికిళ్ళు బిగిశాయి.

నేటి యువతరంలో పోరాడే తత్వం లేక పోవడం వలన మన దేశ సరిహద్దులు తగ్గుతూ వస్తున్నాయని చెప్పవచ్చు. విప్లవాత్మకమైనటువంటి సన్నివేశాలను స్వాతంత్ర్యోద్యమం గురించి నెలకు ఒక స్వాతంత్ర్య వీరుడును పరిచయం చేస్తారని కోరుకుంటున్నాను. మన ప్రజాశక్తి ఆదివారం అనుబంధం "స్నేహ"లో స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశాలను తెలియజేస్తే చురుకైన యువత తయారవుతుంది. విజ్ఞాన వీచికలో 'త్వరలో అంతరిక్షంలోకి అడుగు పెడుతున్న వియత్నాం ఉపగ్రహం' గురించి చక్కగా వివరించారు. విజ్ఞానానికి సంబంధించిన అంశాలను చక్కగా, సూటిగా ఒక్క పేజీలో ఇస్తున్నందుకు సంపాదకవర్గానికి నా నమస్కారాలు. టెలికమ్యూనికేషన్ అవసరం ఎంతైనా ఉందని శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు ప్రశంసనీయం. రచయిత ఎస్. వెంకట్రావు గారి కలం నుండి వెలువడుతున్న సైన్సు సంబంధమైన విషయాలను చక్కని శైలిలో ప్రచురిస్తున్న స్నేహకు శుభవందనాలు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కృష్ణా.

యువతకు ఆదర్శం భగత్

భారతదేశ ముద్దు బిడ్డ, దేశభక్తి పరుడు అయిన భగత్‌సింగ్ "ఇంక్విలాబ్ జిందాబాద్" అంటూ ఉరికంబం ఎక్కిన రోజు భారత జాతి గర్వించదగినరోజు. ఈ స్వార్థ రాజకీయ వ్యవస్థను తొలగించేందుకు యువత ముందుకు రావాలి. ఆయన ఉత్తేజాన్ని యువత ఆదర్శంగా తీసుకొని, అవినీతి మచ్చను అణగ దొక్కాలి. 'నరహరి' ప్రజారాజ్యం, తెలుగు వైభవం కావాలంటున్నారు సంతోషం. ప్రేమ ఆగ్రా అగ్రభాగాన ఉందా? వెర్రి ప్రేమ. 'చిగురాకుల్లో చిలకమ్మ' ఆహా ఎంత మంచి మాట.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

'మహిళలు-కాల్షియం బిళ్లలు' విజ్ఞానదాయకంగా వుంది

కవర్ పేజీ 'ఇంక్విలాబ్ జిందాబాద్' వ్యాసం చైతన్య పూరితంగా ఉంది. చాలా విషయాలు పొందుపరిచారు. చరిత్ర నొసటిపై నెత్తుటి సంతకం చేశాడు భగత్‌సింగ్. ఈ సంవత్సరం ఆయన శత జయంతి సంవత్సరం కూడా. భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించడమే నేటి యువత కర్తవ్యం. మహిళలు- కాల్షియం బిళ్లలు వ్యాసం విజ్ఞానదాయకంగా వుంది. వచ్చే నెలలో అంబేద్కర్ జయంతి కనుక ఆదివారం ప్రత్యేక సంచికగా తీసుకురావాలని కోరుతున్నాను.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

తెలుసుకోగలిగాం

23వ నాటి అట్టమీది కథగా 'ఇంక్విలాబ్ జిందాబాద్' భగత్‌సింగ్ విశేషాలను తెలుసుకోగలిగాం. 'బెలూన్ గౌన్లు' తతంగం... వేపకాయ వెర్రిలా ఉన్నా చూద్దానికి గమ్మత్తుగానే ఉన్నాయి. 'ఆరోగ్యం' ద్వారా



కాల్షియం బిళ్లల ప్రాధాన్యత తెలిసింది. 'చూద్దామా..'లో ఆగ్రా అందాలను చూసి తాజ్‌మహల్ తేజస్సు తిలకించి ఆనందడోలికల్లో తేలియాడాం. 'హరి' గారి కార్టూన్లు నవ్వుల్ని రువ్విస్తూనే, సామాజికంగా ఆలోచింపజేసే అంశాల్ని ఎన్ను కోవటం అభినందనీయం. చూటి కథ 'గోళ్ళు' బావుంది. విజ్ఞాన వీచిక నిజంగా విజ్ఞాన దీపికగా వెలుగొందుతోంది. ప్రజలందరికీ అన్ని అవకాశాలూ కల్పించే సమాజాన్ని స్థాపించే ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపాలని అభిలషిస్తూ జనంలో చైతన్యాన్ని పెంచాలంటున్న మన అతిథి మోతుకూరు నరహరి గారితో ఏకీభవిస్తూ....

నేమాన సుభాష్‌చంద్రబోస్
ఇలిసిపురంజంక్షన్,
శ్రీకాకుళం టౌన్.

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.


బిస్కెట్! నీమ ఫ్లవర్ పికిల్..? అంటే!
కంగారు పడకండి! ఉగాది పచ్చడి... కాన్వెంట్ చదువులు కదా...!!!
శేఖర్.


ఉగాది పచ్చడి తినిపిస్తానని మా ఆవిడ... తినిపించలేవని నేను పందెం వేసుకున్నాం... ఇక్కడెలా తినిపిస్తుందో చూస్తా..!!
V. Rama krishna


అమ్మాయికి బ్లాక్ బెల్టు వుందంటే నడుముకు పెట్టుకొనేది అనుకున్నా కరాటేలో అనుకోలేదబ్బాయి...!!
V. Rama krishna


కోయిల కమ్మని కంఠ మాధుర్యం... లేత మామిడి చిగుళ్ళు.... చిగురాకుల వేప పువ్వుల కోసం... ఇక్కణ్ణుంచి వెదకడం కేవలం అవివేకమోయ్...!!
శేఖర్.


పర్లే...! ఆగండిక! ఉగాది పచ్చడి తినమని బలవంతం చెయ్యన్లే...!!!
ఉగాది పచ్చడి
శేఖర్.


మీ వారిపై గిట్టని వారెవరో విషప్రయోగం చేశారనుకున్నా...!!
పొద్దుట లేచాక నే చేసిన ఉగాది పచ్చడి తప్ప ఆయన మరేం తిన్లేదు సార్...!!!
ఆపరేషన్ థియేటర్
శేఖర్.


పంట బాగా పండి అధిక దిగుబడి వచ్చిందా? చేనుకు ఏ క్రిమిసంహారక మందు వాడావ్?
మా ఆవిడ చేసిన ఉగాది పచ్చడితో పిచికారీ చేసి జల్లానంతే...!!!
శేఖర్.


తీపి... పులుపు... వగరు... లేకుండా ఒక్క 'చేదు' మాత్రమే వుందేమిటే ఈ ఉగాది పచ్చడిలో?
అది కుంకుడికాయ రసమండీ! స్నానానికని అక్కడ పెట్టా...!!
శేఖర్.

డా॥ విజయ్

పద్ధతి మార్చుకుందాం

ప్రకృతిని ఆరాధించడం అనే మాటని మనం తరచూ వాడుతుంటాము. ప్రకృతి అందాల్ని ఆస్వాదించడం కోసం కొండ ప్రాంతాలకీ పల్లె సీమలకీ వెళ్తుంటాం కానీ పెరట్లో చెట్టుని నరికేస్తాం. ప్రకృతిని పాడు చేసే కాలుష్యాల గురించి అనర్గళంగా గొంతెత్తుతాం కానీ మన ఇంట్లో ఉత్పత్తి అవుతున్న కాలుష్యాల గురించి ఆవగింజంత అవగాహన కూడా ఉండదు. మన ఇంటి ముందు రోడ్డుపై పారే నీటి గురించి పొదుపు మాటలు పొదుపు లేకుండా మాట్లాడతాం గానీ ఇంట్లో కొళాయి లీకు గురించి పెద్దగా పట్టించుకోము. వ్యక్తిగతంగా మనమూ, సంఘటితంగా అభివృద్ధి చెందిన దేశాలు ఇటువంటి ద్వంద్వ వైఖరినే ప్రకృతిపట్ల ప్రదర్శిస్తున్నాయి.

ఈనాడు వ్యర్థమౌతున్న ప్రకృతి వనరుల గురించీ, అధికమౌతున్న కార్బన్ డైఆక్సైడ్ గురించీ తరిగిపోతున్న ఓజోన్ పొర గురించీ, మారిపోతున్న ఋతుచక్రాల గురించి చాలా మంది మాట్లాడుతున్నారు. కానీ వారు ప్రస్తావిస్తున్న సమస్యలు ఏ మాత్రం పరిష్కరించబడటం లేదు. 'నేనొక్కణ్ణి ఏం చేయ గలను' అనే అసహాయత నుండి నేనొక్కణ్ణే ఈ స్థితికి కారణమా అనే సంకుచితత్వం వరకూ అనేక కారణాలున్నాయి. కానీ బలౌతున్నది ప్రకృతే. అలా ప్రకృతిపై జాలిపడటం వల్ల మనం గొప్ప వాళ్లమై పోవడం లేదు. ప్రకృతికి తనను తాను పునః ఆవిష్కరించుకోగల శక్తి ఉంది. అది కాలానుగుణంగా ఆ పని చేస్తుంటుంది కూడా. ఎటొచ్చీ ఇబ్బంది పడేది మాత్రం మానవుడే. ఆ ఇబ్బంది మనం కాకపోయినా మన భవిష్యత్ తరాలు పడకుండా ఉండాలంటే చిన్న చిన్నవైనా కొన్ని పనులు చేయక తప్పదు.

ఇలా చేద్దాం

❖ ముందుగా, ఇంట్లో అన్నీ ఫ్లోరసెంటు బల్బులను వాడండి. ఫ్లోరసెంటు బల్బులు (ట్యూబ్‌లైట్లు) ఇన్‌కాండిసెంట్ బల్బుల కంటే ఖరీదైనవే. కానీ వాటికంటే ఎక్కువ కాలం మన్నుతాయి. తక్కువ విద్యుత్‌ని తీసుకుంటాయి. కాంపాక్ట్ ఫ్లోరసెంట్ ల్యాంప్ (సిఎఫ్ఎల్)లు ఇంకా మెరుగైనవి. వీటి వాడకం వలన దాదాపు 30 శాతం విద్యుత్‌ని ఆదా చేయవచ్చు.

❖ వంట గదిలో మీరు చాలా రకాలుగా విద్యుత్‌ని, ఇంధనాన్ని ఆదా చేయవచ్చు. తత్ఫలితంగా కాలుష్యాన్ని తగ్గించవచ్చు కూడా! ప్రతి చిన్న పనికీ మిక్సర్/గ్రైండర్‌ని వాడటం తగ్గించండి. వీలైనంత వరకూ రోట్లో దంచండి/రుబ్బండి. మిక్సర్‌లు విపరీతమైన విద్యుత్‌ని లాగేస్తాయి. అలాగే వంటని జాగ్రత్తగా ప్లాన్ చేసుకోండి. చీటికి మాటికీ స్టవ్ వెలిగించి వంటకాల్ని వేడి చేసుకోవడం మంచిది కాదు- మీ గ్యాస్ ఖర్చుకీ, మీ వంటల రుచికీ, మీ ఆరోగ్యానికీ! అదే విధంగా పాత్రల శుభ్రత విషయంలో కూడా చాలా జాగ్రత్త అవసరం. వాడిన పాత్రలను వెంటనే శుభ్రం చేస్తే సులభంగా ఉంటుంది. అవి ఎండిపోయాక అయితే వాటిని నానబెట్టడానికి నీళ్లు వ్యర్థం అవుతాయి. తక్కువ సబ్బు/పౌడర్ బూడిద వాడితే తక్కువ నీటితోనే పని పూర్తవుతుంది. అవి ఎక్కువ వాడితే ఎక్కువ శుభ్రపడేది ఏమీ లేదుగా! మనకి ఖర్చు తప్ప!

❖ మినరల్ వాటర్‌ని తక్కువగా వాడండి. సమస్య నీటి వాడకం కాదు ప్లాస్టిక్ బాటిళ్ల వలన. జాగ్రత్తగా ఫిల్టర్ చేసిన, లేదా కాచి, చల్లార్చిన నీరు తాగండి గానీ ప్లాస్టిక్ బాటిళ్లను విరివిగా వాడకండి. లేదా మళ్లీ మళ్లీ వాడగలిగే సీసాలను ఎంచుకోండి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు కూడా ఇంట్లోకి తేవడం మానివేయండి. సరుకులు తేవడానికి మీ సొంత సంచి తీసుకెళితే ఉత్తమం. ప్లాస్టిక్‌ని అలాగే పారేస్తే భౌమ్య కాలుష్యం (కొన్ని దశాబ్దాలైనా ప్లాస్టిక్ నేలలో విచ్ఛిన్నం కాదు), కాల్చితే వాయు కాలుష్యం. మరో మాట- ఇటువంటి ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీకి బోలెడు పెట్రోలియం ముడి పదార్థాలూ, విద్యుత్ ఖర్చవుతుంది. ఆ ఖర్చుకి, తద్వారా ఉత్పన్నమయ్యే కాలుష్యానికీ మన వంతు పాత్ర ఎంత అన్నది తెలుసుకోవాలంటే ఒక నెల తరువాత మీ ఇంట్లో పేరుకున్న క్యారీబ్యాగులు, పాల ప్యాకెట్లు మినరల్ వాటర్ బాటిళ్ళు చూడండి.

❖ కూరగాయలు, పళ్లు వంటివి మనకి దగ్గర్లో పండించినవే తీసుకోండి. తూర్పు



దేశాల నుండి వచ్చేవి. ఎంతో ఖరీదైనవి కావడానికి కారణం వాటి రవాణా ఖర్చులు. మనం ఆలోచించవలసిందేంటంటే... వాటి రవాణా కోసం ఖర్చైన ఇంధనం, దాని ఫలితంగా విడుదలైన కాలుష్యం. అమెరికా ఆపిల్ పండ్ల కంటే, మన దగ్గర పండిన జామకాయలే మేలు- అన్ని విధాలా!

❖ ఇంటి పెరట్లో మొక్కలు, చెట్లు పెంచండి. చిన్న మొక్కలైనా గానీ చాలా కార్బన్ డయాక్సైడ్‌ని నియంత్రిస్తాయి. పైగా మనకు కావలసిన కూరగాయల వంటివి కొనుక్కునే అవసరమూ తగ్గుతుంది. వంటింటి వ్యర్థాలు ఎరువుగా ఉపయోగ పడతాయి. (బియ్యం కడిగిన నీళ్లు, గంజి, కూరగాయల ముక్కలు, మిగిలిన అన్నం, వడేసిన కాఫీ, టీ పొడి...).

❖ బట్టలు వాషింగ్‌మెషీన్‌లో ఉతకడం వల్ల నీరు బోలెడు వ్యర్థమవ్వడమే కాక ఆ వ్యర్థ నీటిలో చాలా రసాయనాలు (డిటర్జెంట్లు) కలవడం వలన కాలుష్యం కూడా! తక్కువ డిటర్జంట్, సబ్బుతోనూ ఉతకడం వలన తక్కువ నీరు అవసరమౌతుంది. తక్కువ బట్టలు ఉతికేటప్పుడు వాషింగ్ మెషీన్ వాడకపోవడం మనకి ఆదా, పకృతికి మేలు! డబ్బు ఆదా, ప్రకృతికి మేలు!

❖ వీలైనంత వరకూ నడక/సైకిల్ వల్ల వ్యాయమం, ఆరోగ్యం, డబ్బు ఆదా, ప్రకృతికి మంచి జరుగుతుంది.

❖ టీవీలు, కంప్యూటర్లు వాడకపోతే స్విచ్ఛాఫ్ చేసి, ప్లగ్ కూడా తీసెయ్యండి. రిమోట్‌తో ఆఫ్ చేసి ఊరుకుంటూ కరెంటు ఖర్చవుతూనే ఉంటుంది. అనవసరంగా విద్యుత్‌ని వాడకండి. మన డబ్బులు కద్దున్నా, అది ప్రకృతి ఉమ్మడి కష్టం నుండి ఉత్పత్తి అవుతోంది. పైగా, విద్యుత్ పరికరాల వల్ల వాతావరణంలో CO_2 పెరుగుతుంది.

ఈ కొన్ని అంశాలను పాటించగలిగితే ప్రకృతికి మనవంతు మేలు చేసిన వారమౌతాం.

❄

ఆరోగ్యం

పిల్లలు- పోషకాహారం

పిల్లలకు పోషకాహారం తినిపించాలంటే తల్లిదండ్రులకు తల ప్రాణం తోకకు వస్తుంది. మంచి పోషకాలు, విటమిన్లు ఉన్న ఆహారాన్ని వీరు అంతగా ఇష్టపడరు. ఎక్కువగా చిరుతిళ్లు, కూల్‌డ్రింకులు, బర్గర్లు, పిజ్జాలు, నూడిల్స్‌కు అలవాటు పడుతున్న నేటి పిల్లలకు సమతుల్య ఆహారం తినిపించడం ఒక యజ్ఞమే. ఇలా మొండికేసే పిల్లలకు మంచి పోషక విలువలున్న ఆహారం గురించి ఎలా వివరించాలో తెలుసుకుందామా....

ముంతాజ్ వయసు 16 ఏళ్లు. ఈ మధ్య కళ్లు సరిగ్గా కనిపించడం లేదని తల్లికి ఫిర్యాదు చేసింది. పాపను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ పోషకాహార లోపం వల్ల దృష్టిలోపం వచ్చిందన్నారు. ముంతాజ్ తల్లిదండ్రులిద్దరు విద్యావంతులే. వీరు కూడా ఆకు కూరలు, కూరగాయలు పాపకు తినిపించాలని ప్రయత్నించారు. పాప తినినని మారాం చేయడంతో వదిలేశారు. అంతేకాని వీటి ప్రాముఖ్యతను గురించి వివరించడంలో విఫలమయ్యారు. ముఖ్యంగా ఎదిగే వయసు పిల్లలకు పోషకాహారం తప్పనిసరి. ఇందులో ఏది తక్కువైనా దాని ప్రభావం వారి ఆరోగ్యంపై ఉంటుంది. ముంతాజ్ లాంటి పిల్లలు మన మధ్య ఎంతో మంది ఉంటారు...

చిన్న వయసులోనే పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు నేర్పిస్తే పెద్దయ్యాక వీటికి అలవాటు పడతారని సైకాలజిస్ట్ అశిమ పూరి అంటున్నారు. జీవితాంతం గుర్తుండిపోయే విధంగా వీటి గురించి పిల్లలకు చెప్పాలి. తల్లిదండ్రులు తీసుకునే ఆహారంపైనే పిల్లల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఒక సర్వే వెల్లడించింది. రోజూ తీసుకునే ఆహారంలో కొవ్వు శాతం 30 నుంచి 36 శాతం ఉన్న తల్లిదండ్రుల పిల్లలకు ఐదేళ్లు వచ్చే సరికి వారిలో తక్కువ కొలెస్ట్రాల్ ఉందని సర్వే వెల్లడించింది. అంతేకాక స్థూలకాయం, గుండె జబ్బులు వచ్చే ప్రమాదమూ తగ్గిందని పేర్కొంది. తల్లింద్రులకు మంచి ఆహారపు అలవాట్లు ఉండి, క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వారైతే పిల్లలు కూడ వీరిని అనుకరిస్తారు. కూరగాయలు తినాలని ఉపన్యాసాలు ఇవ్వడం దండగే. ఇలా కాకుండా ఆకుపచ్చని కూరగాయలను ఒక ప్లేటులో తీసుకుని పిల్లలకు విశ్లేషిస్తూ, వివరంగా చెబితే ఆ ప్రభావం అంతా ఇంతా కాదు. చాలా ఉంటుంది. టీవీ చూస్తూ తినడం వల్ల నష్టమే తప్ప లాభం ఉండదు. ఎందుకంటే కార్యక్రమం వస్తున్నంతసేపు తింటూ ఉంటాం. తినేటప్పుడు ఎంత తింటున్నామో గమనించం. దీంతో స్థూలకాయం పెరుగుతుంది. అందుకని టీవీ చూస్తు తినే పద్ధతిని పిల్లలకు అలవాటు చేయకూడదు. పిల్లలను చీవాట్లు పెట్టడం వల్ల ఫలితం ఉండదు, దీనికి ఒక ఉదాహరణ ఈ అధ్యయనం. ఏడేళ్ల వయసున్న 186 మంది బాలికలు, వారి తల్లుల ఆహారపు అలవాట్లును పెన్‌సిల్వేనియా స్టేట్ యూనివర్శిటీకి చెందిన నిపుణులు పరిశీలించారు. తల్లిదండ్రుల ఒత్తిడి వల్లే వీరు ఎక్కువ తింటున్నారని వెల్లడైంది. "మా పాప వయసు 18 సంవత్సరాలు. అదనంగా ఒక చపాతి తినాలని నేను ఒత్తిడి చేయడం మానలేకపోతున్నాను' అని ఒక గృహిణి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తప్పదని పాప కూడ తినడం అలవాటు చేసుకున్నది. తల్లి పిల్లలు ఈ పద్ధతికి ఇలా అలవాటు పడ్డారు.

ఇలా చేసి చూద్దాం.

మీ పిల్లలు వివిధ రకాలైన ఆహారాన్ని తినడానికి అంగీకరించాలంటే వారికి వీటిని మళ్లీ మళ్లీ పెట్టాల్సిందే. ఆకు కూరలు, కూరగాయలు తియ్యగా ఉండవు. ఇలాంటి వాటిని ఐదు నుంచి 15 సార్లు పిల్లలకు పెడితేకానీ అలవాటుపడరు. క్యాబేజీ కూరను ఒక ప్లేటులో ఉంచండి. కానీ తినాలని పిల్లలపై ఒత్తిడి చేయకండి. ఇలా ఒత్తిడి చేయడంవల్ల దీనిపై వీరికి అసంతృప్తి ఏర్పడుతుంది. అలా కాకుండా ఎక్కువగా కూరగాయలను తినమని చెప్పాలి. పిల్లలకు ఆహారం నచ్చాలంటే కొత్త విధానాలు అవలంభించాలి. వివిధ రకాల కూరగాయలతో కలిపి వంటకాలు చేస్తే మంచిది. తర్వాత దేన్ని ఇష్టపడతారో వాటినే వారికి పెట్టాలి. పిల్లలు ఏం తినాలో తల్లిదండ్రులు నిర్ణయించకూడదు. సంవత్సరం నిండిన దగ్గర నుంచి భిన్నమైన ఆహార పదార్థాలను తినే అవకాశం వారికి ఇవ్వాలి. వీటికి అలవాటు పడితే క్రమంగా పెట్టే ఆహారాన్ని పెంచొచ్చు. మసాలా ఉన్న ఆహార పదార్థాలను తినడం అలవాటు చేయకూడదు. ఇంట్లో అందరూ ఏం తింటున్నారో పిల్లలకూ అదేపెట్టాలి. ప్రశ్నించడం పిల్లలకు అలవాటు, వారి హక్కు కూడా. బర్గర్లు, పిజ్జాల కంటే క్యాబేజీ, పాలకూర ప్రత్యేకత ఏమిటని ప్రశ్నిస్తారు. దీనికి విసుక్కోకుండా సమాధానం చెప్పాలి. వీటి మధ్య ఉన్న తేడాను, లాభాలను వివరించాలి. కూరగాయల గురించి వివరించే మంచి సమయం ఇదే. కుటుంబంలో అంతా కలిసి భోజనం చేయడం మంచిది. అందరితో కాకుండా ఒంటరిగా పిల్లలు తింటుంటే తినే ఆహారంపైనే దృష్టి సారిస్తారు. మీరు అంతగా పట్టించుకోని కూరగాయలను పిల్లలు ఇష్టంగా తింటుంటే, వీరికోసమైనా మీరు వాటిని తినాలి. ఎప్పుడు కూడా ఏ ఆహారాన్నైనా తినకూడదని పిల్లలకు చెప్పకూడదు. వారానికోసారి మాత్రమే ఫాస్ట్‌ఫుడ్ తినడానికి అనుమతి ఇవ్వొచ్చు. టిఫిన్, భోజన సమయాలను క్రమం తప్పకుండా పాటించాలి. తినడాన్ని పిల్లలు ఎంజాయ్ చేసే విధంగా ఉండాలి. ఆలుగడ్డ చిప్స్ అంటే మీ పిల్లలు ఇష్టపడుతుంటే కాదనకండి. కానీ చిన్న పాకెట్‌ను మిత్రులతో కలిసి తినాలని ప్రోత్సహించండి. సాఫ్ట్‌డ్రింకులపై నిషేధం తప్పనిసరి. పెద్దవాళ్ల కంటే పిల్లలే ఎక్కువగా సాఫ్ట్ డ్రింకులు తాగుతుంటారు. పిల్లల్లో స్థూలకాయం పెరగడానికి ఇవే కారణమని ఇటీవల జరిగిన పరిశోధన వెల్లడించింది. సాఫ్ట్‌డ్రింకుల వల్ల శరీరంలో చేరే కేలరీలకు సమానంగా ఉన్న ఆహారాన్ని అందించాలి (శాండ్‌విచ్, పళ్లు, స్నాక్స్, ఛీజ్). షాపింగ్ చేసేటప్పుడు పిల్లలకు పోషకాహారం గురించి వివరించాలి.

భోజనం చేసేటప్పుడు కనీసం ఒక రకం పండునైనా వారికి తినిపించాలి. పెద్దయ్యాక ఆహారంలో పళ్లు, కూరగాయలు తినడం వారికి అలవాటవుతుంది. పిల్లలకు బాగా ఆకలిగా ఉన్నప్పుడు డైనింగ్ టేబుల్‌పైన ముందుగా వండిన కూరగాయలను ఉంచండి. ఈ సమయంలోనే వారు ఏదైనా తినేందుకు సిద్ధంగా ఉంటారు. కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ప్రమాదం చాలా తక్కువని పరిశోధనల్లో వెల్లడైంది.

❋

తెర

ముంబాయికి కేవలం అరవై మైళ్ల దూరంలో నాగరికతకు దూరంగా కామందుల దోపిడీకి, పీడనకు బలిపశువులుగా బతుకుతున్న వర్లీ ఆదివాసుల పోరాటం భారత దేశంలోని గిరిజన పోరాటాలలో తలమానికమైంది. వూహాతీతమైనంత దుర్భరస్థితిలో బతుకుతున్న వర్లీల మధ్య ప్రవేశించి వారిలో కలసిపోయి ఆ ఆదివాసులలో పోరాటాల అగ్నికణం రగిలించిన వీరవనిత గోదావరి పెరులేకర్. "బొంబాయికి చెందిన థానే జిల్లాలో నివసించే ఆదివాసులైన వర్లీల తిరుగుబాటుకు ఒక మహిళ నాయకత్వం వహిస్తున్నది" అని ఆస్ట్రేలియా టెలిగ్రాఫ్ పత్రిక విలేకరి మెఖేల్ బ్రౌన్ ఆ రోజుల్లోనే(1947) ప్రత్యేక కథనంలో పేర్కొన్నారంటే ఆ పోరాటం అంతర్జాతీయ రంగాన్ని కూడా ఎలా ఆకర్షించిందో తెలుస్తుంది."ఆదివాసుల తిరుగుబాటు మన కళ్లు తెరిపించాలి" అని గాంధీజీ అనుచరుడైన నరహరి పరేఖ్ రాశారు. పోరాటానికి నాయకత్వం వహించడమే కాక ఆ అనుభవాలను అత్యంత ఉత్తేజకరంగా ఆమె గ్రంథస్తం చేశారు. అ అద్భుత గ్రంథమే 'వర్లీ ఆదివాసుల తిరుగుబాటు'.



ఆదివాసుల్లో అగ్నికణం అక్క సమర స్మృతులు

గోదావరి, ఆమె భర్త శ్యాం రావ్ పెరులేకర్ ఉభయులూ కమ్యూనిస్టు పార్టీలో పూర్తికాలం కార్యకర్తలు. దీర్ఘ కాలం పాటు వుద్యమంలో పనిచేస్తూ అనేక అగ్ని పరీక్షలు, నిర్బంధాలు ఎదుర్కొన్నవారు. 1940లోనూ, 1962లోనూ రెండు సార్లు వారు జైళ్ల పాలైనారు. రెండవ సారి జైలులో వున్నప్పుడే శ్యాం రావ్ ఆదివాసుల పోరాటం గురించి పుస్తకం రాయవలసిందిగా తన భార్యను గట్టిగా ప్రోత్సహించారు. ఆమె అర్థ మనస్కంగా మొదలుపెట్టి రాస్తుండగానే ఆయన అనారోగ్యం పాలై మరణించారు. ఆ బాధతోనే గోదావరి పుస్తకాన్ని పూర్తి చేశారు. అయితే అది అందరి మన్ననలు పొందడమే కాక దేశ వ్యాపితంగా ప్రసిద్ధికెక్కింది. మహారాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా లభించింది. అనేక భాషల్లోకి అనువదించబడింది. వి.శ్రీహరి అనువాదంతో 1976లో తొలిసారి ప్రజాశక్తి ప్రచురణగా తెలుగులో వెలువడిన ఈ పుస్తకం ద్వితీయ ముద్రణ ఇప్పుడు వచ్చింది.

170 పేజీల ఈ పుస్తకంలో మొత్తం 14 అధ్యాయాలున్నాయి. 'పూర్వరంగం' అన్న మొదటి అధ్యాయం థానే జిల్లాలోని అంబెర్‌గావ్ దహన్, పాల్ఘర్, జవహర్ తాలూకాల అడవుల్లో జీవించే ఆదివాసులు తమ భూములను తామే కోల్పోయిన వైనాన్ని వివరిస్తుంది. భూస్వాములు వారిపై సాగించిన అమానుష దోపిడీ పద్ధతులు వెల్లడిస్తుంది. ఒక వందేళ్ల కాలంలో బయట నుంచి వచ్చిన వారు ఆదివాసుల భూములను కబళించిన వైనాన్ని వివిధ అధికారిక నివేదికలు నమోదు చేశాయి. 1939లోనే అప్పటి రాష్ట్ర రెవెన్యూ మంత్రి మొరార్జీ దేశాయి ఈ విషయాన్ని చెప్పారు. ఇలాంటివే ఇంకా చాలా ఉదాహరణలున్నాయి.

రెండవ అధ్యాయంలో రచయిత్రి వర్లీల జీవితాలను వర్ణించారు. థానే జిల్లా తిత్‌వల్లాలో కిసాన్‌సభ మహాసభ కోసం వెళ్లిన సందర్భంలో ఈ దంపతులకు వారి గురించి లోతుగా తెలుసుకునే వీలు కలిగింది. శ్యాం రావ్ ప్రతిపాదనపై వారిలో పని చేయాలని నిర్ణయించుకున్నారు. చాలా ఉత్సాహంగా ఆదివాసీ ప్రాంతాలకు వెళ్లారు. అప్పటి వరకూ నగరవాసిగా సదుపాయాలతో కూడిన జీవితం అనుభవిస్తున్న గోదావరి ఒక కొత్త జీవన స్రవంతి గురించి తెలుసుకోవాలని డాల్లీ అనే మరో కామ్రేడ్‌తో కలసి వెళ్లారు. జనం కిటకిటలాడి పోతున్న బస్సులో ఎలాగో ప్రయాణించి వారి దగ్గరకు చేరారు. మహాసభలో వారి ప్రసంగాలు విన్నప్పటి నుంచి వారి పట్ల ఆసక్తి పెంచుకున్న ఆదివాసులు ఎంతో ఉత్సాహంగా గౌరవంగా వారిని ఆదరించారు. రెండవ ప్రపంచ యుద్ధ నేపథ్యంలో నిషేధాజ్ఞలు వున్నప్పటికీ వారి అభీష్టం మేరకు సమావేశం ఏర్పాటుచేశారు. భూస్వాములకు, వారి తైనాతీలకు భయపడనవసరం లేదని ధైర్యం చెప్పారు. సాహసం, సంకోచం మధ్య వూగిసలాడుతూనే స్పందించారు ఆదివాసులు. ఆమె తనతో తీసుకెళ్లిన ఎర్రజండాను గోడకు తగిలించడానికి పిన్నులు లేకపోతే ముళ్లతోనే అతికించి తమ ప్రకృతి సిద్ధ గుణాన్ని నిరూపించుకున్నారు. అక్కడి వారికి కనీసమైన తిండి కూడా దొరకదు. కందమూలాలు తిని బతుకుతున్నారు. భూస్వాములు వారితో అహోరాత్రాలు పని చేయించుకుంటారే గాని కనీసం తిండికి కూడా సహాయపడరు. స్నానం కూడా వారానికి ఒకటి అర సార్లు మాత్రమే చేసే వీలు దొరికితే అదే గొప్ప. అయినా వీటన్నిటినీ తట్టుకుంటూ గోదావరి పెరులేకర్ ఆదివాసుల గ్రామసీమల్లో పర్యటిస్తారు. అక్కడే ఆదివాసుల వింత వింత ఆహారపదార్థాలు మూఢనమ్మకాలు ఎన్నో తెలుసుకుంటారు. తవుడుతో అంబలి, పుల్లకూరతో భోజనం ఇలా అన్నీ చూస్తారు. ఆదివాసుల పరిస్థితి వారికి దిగ్భ్రాంతి కలిగిస్తుంది.

'భూస్వామ్య వైభవం, చిత్రహింసల తీరు' అనే మూడు నాలుగు అధ్యాయాలు ఆ పోరాట క్రమంలో వారెదుర్కొన్న భయానక పరిస్థితులకు తెలియజేస్తాయి. ఉదాహరణకు ఆ ప్రాంతంలో 'దాస్యపు కడ్డీ' అని ఒకటి వుంది. భూస్వాములు దాన్ని ఎవరికి పంపిస్తే వారు ఆ రోజు వెట్టిచాకిరీకి వెళ్లవలసిందే! మహిళలపై అత్యాచారాలకు, అమానుషాలకు అంతేలేదు.అంతగా గోదావరి పెరులేకర్, డ్వాలీలు తమ ఎదుటే భూస్వాములను వారి తాబేదార్లయిన అధికారులను ఎదిరించడం చూసి ఆదివాసులు కూడా ధైర్యం తెచ్చుకుంటారు. 'అక్కా... అక్కా...' అంటూ ఆమె అడుగుజాడల్లో నడుస్తారు. సమ్మెలు, పోరాటాలకు సాహసిస్తారు. తమకు అణిగిమణిగి పడివున్న ఆదివాసులను పశువుల కన్నా హీనంగా చూసే భూస్వాములు ఒక్కసారిగా వారిలో వచ్చిన కదలిక చూసి హడలిపోతారు. భయానకమైన హింసాకాండకు పాల్పడతారు.

ఈ పోరాటాల ఫలితంగా భూస్వాముల పీడన కొంచెం తగ్గుముఖం పడుతుంది. ప్రభుత్వం కూడా కొంతవరకైనా కదలక తప్పని స్థితి ఏర్పడుతుంది.ఆదివాసుల మహాసభ ఏర్పాటు చేసి దాని ప్రచారం కోసం విస్తృతంగా పర్యటిస్తూ చైతన్యం కలిగిస్తారు.

ప్రతిచోటా కమ్యూనిస్టు కార్యకర్తలకు ఘన స్వాగతం లభిస్తుంది. కాని వారికి ఎవరూ ఆశ్రయం ఇవ్వకూడదని అడ్డుకోవడానికి భూస్వాములు ఆంక్షలు ప్రకటిస్తే చాలా ఇబ్బంది కరమైన ప్రదేశాల్లో- గుర్రపు శాలల్లో కూడా తలదాచుకుని తమ వర్లీలను చైతన్య పరచే కృషి కొనసాగిస్తారు. ఈ వివరాలన్నీ అయిదవ అధ్యాయంలో వుంటాయి. ఈ కృషి ఫలించి మహాసభ జయప్రదంగా జరగడం, 'వెట్టిచాకిరీ నశించాలి' అన్న నినాదం మార్మోగడం ఆరవ అధ్యాయం. గిరిజనులు పెళ్లి ఖర్చుల కోసం రు.200-300 అప్పు తీసుకుని ఆ తర్వాత జీవితాంతం వివాహ బానిసలుగా వుండిపోయే పద్ధతికి స్వస్తిపలకడం ఏడవ అధ్యాయం. 'ఎర్రజండా పిలుపు' అన్న ఎనిమిదవ అధ్యాయం ఈ పోరాటక్రమానికి తారాస్థాయి. సమ్మెలు, నిరసనలతో వర్లీలు భూస్వాములను సవాలు చేసే స్థితి. కూలీ రేట్లు పెంచుకోవడం, తమపై నిర్బంధాన్ని తట్టుకోవడానికి అడవుల్లోకి పోయి ఆయుధాలతో సహా గెరిల్లా పోరాటానికి సిద్ధమవడం వంటివి చూస్తాం. వేలమంది ఆదివాసులు సమీకృతులవుతుంటే దిక్కు తోచని భూస్వాములు, అధికారులు దారుణ దమనకాండకు పథకం వేస్తారు. 1945 అక్టోబరులో వేలమంది ఆదివాసుల సమీకరణపై కాల్పులు జరిపి అయిదుగురిని బలిగొంటారు.

పైగా ఉద్రిక్తతలకు కారకులయ్యారనే పేరుతో ప్రభుత్వం గోదావరి పెరులేకర్ తదితరులను ఆ జిల్లానుంచి బహిష్కరిస్తుంది. పోలీసులు, భూస్వాములు వర్లీలపై అనేక రాక్షసాలు సాగిస్తారు.

ఈ పరిస్థితుల్లో దేశ రాజకీయాలు మారతాయి. 1946లో కాంగ్రెస్ అధికారం చేపడుతుంది. అయితే ఆదివాసుల పక్షం వహించకపోగా కమ్యూనిస్టులపై, గిరిజనులపై అణిచివేతకు దిగుతుంది. భూస్వామ్య వర్గాలు కూడా కాంగ్రెస్‌లోకి మారిపోతాయి. పోలీసు కాల్పులలో బలైన అమరుల సంస్మరణసభను అడ్డుకోవడానికి ముందస్తుగా నిషేధాజ్ఞలు విధించడంతో ఆదివాసుల అసంతృప్తి మరోసారి భగ్గుమంటుంది. భూస్వాములు దిగివచ్చి కూలిరేట్ల పెంపుతో సహా కొన్ని కోర్కెలకు ఒప్పుకుంటారు. అత్యంత దారుణమైన రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేయడమే కాక మరోసారి వారిని బహిష్కరిస్తుంది. మరోసారి కాల్పులతో సహా ఘోర నిర్బంధ కాండ సాగుతుంది. ఈ వివరాలు 10,11 అధ్యాయాలలో చూస్తాం. బహిష్కరణకు గురైన ఆమెను ఆదివాసులు కళ్లలో పెట్టుకుని కాపాడుకుంటారు. తన రహస్య జీవిత ఘట్టాలను కూడా ఆమె ఎంతో హృద్యంగా అక్షర బద్ధం చేశారు.

ఈ పోరాటాల ఫలితంగా భూస్వాములు కొంతవరకు వెనుకడుగు వేయగా ఆదివాసుల చైతన్యం అమోఘంగా పెరిగిన తీరును ఆమె చివరి అధ్యాయాలలో సోదాహరణంగా వర్ణిస్తారు. కొత్త ప్రపంచం ద్వారాలు తెరచు కున్నాయంటారు. తర్వాత వివిధ సందర్భాలలో తాను ఆ ప్రాంతానికి వెళ్లినపుడు గమనించిన విషయాలు చెబుతూనే నేటికీ వారి పరిస్థితులు పూర్తిగా మారలేదన్న ఆవేదనతో ముగిస్తారు.

ఇప్పటికీ గిరిజన ప్రాంతాలలో అంటువ్యాధులు ప్రబలడం, అత్యాచారాలు, మూఢనమ్మకాలు కటిక పేదరికం వంటి విషయాలు చూస్తున్న వారికి గోదావరి పెరులేకర్ మాటల్లో నిజం తప్పక స్ఫురిస్తుంది. ఈ సమస్యలపై పోరాటాలు, చైతన్యం పెరుగుతున్న నేటి వాతావరణంలో ఈ పుస్తకం చాలా ప్రేరణ నిస్తుంది. అలాగే ప్రజా ఉద్యమాలలో పనిచేసే వారు ఎలాంటి కష్టనష్టాలనైనా తట్టుకుని ప్రజల మధ్యలో వుండి పోవాలన్న తపన కలిగిస్తుంది.

వర్లి ఆదివాసుల తిరుగుబాటు
గోదావరి పెరులేకర్,
తెలుగు అనువాదం: శ్రీహరి,
వెల:60/-, పేజీలు170
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్.









సీరియల్

మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**

హంక్‌పాపా

జరిగినకథ

రోజ్‌బడ్ సంఘటన తర్వాత, షెయెనీలు గ్రేజీగ్రాస్ (లిటిల్ బిగ్ హార్న్) వద్ద సమావేశమయ్యారు. పశ్చిమ మైదానాలలో దుప్పల మందలు పుష్కలంగా వున్నాయనీ, బగా పెరిగిన గడ్డి గుర్రాలకు మేతగా పనికొస్తుందనీ వార్తాహరులు కొత్త సమాచారమందించారు. ఇంకేం కావాలి. తమ సమస్యలన్నీ తీరినట్టే. మూడు మైళ్లు నడిచి ప్రైరీ చేరుకున్నారు షెయెనీలు. వీళ్ళ సంఖ్య మనకు ఖచ్చితంగా తెలియదు గాని, మూడు వందల మంది యోధులతో కలిసి, కనీసం వెయ్యికి తగ్గకుండా వుండి వుంటుంది.

అమెరికన్ డేగ

(47వ భాగం)

వీళ్లకు తూర్పువైపున హంక్‌పాపా క్యాంపు ఉన్నది. బ్లాక్‌ఫుట్ సియోలు కూడా అక్కడే బస చేశారు. వీళ్లు నివాసాలన్నీ వృత్తాకారంలో ఏర్పాటు చేసుకుంటారు. ముందరి వరుసలో ఎప్పుడూ హంక్‌పాపాలే వుంటారు. వాళ్ల వెనక సాన్స్ ఆర్క్‌లూ, మిన్నెకూంజ్‌లూ, ఓగ్లాలాలూ, బ్రూల్‌లూ, వుత్తరాన షెయెనీలూ గుడారాలు వేసుకుంటారు.

❖ ❖ ❖

అది "మూన్ వెన్ ది చోక్ బెర్రీస్ ఆర్ రైప్' రుతువు. మధ్యాహ్నం వేడిగా వుంది. మంచు కరిగి ఏర్పడిన తటాకాలలో పిల్లలు ఈత కొడుతున్నారు. వేట బృందాలు వుల్లాసంగా ఆహార సేకరణలో నిమగ్నమైపోయాయి. ఎక్కువ ప్రయత్నించకుండానే దున్నలూ, దుప్పులూ దొరుకుతున్నాయి. స్త్రీలు అడవి టర్నిప్ దుంపలు తవ్వి శుభ్రం చేస్తున్నారు (టర్నిప్‌లను ఆహారంగా తీసుకుంటారు). ప్రతి రాత్రీ ఒక్కొక్క తెగవాళ్ళు డాన్సు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. తెగ నాయకులు సమావేశాలతో భవిష్యత్ వ్యూహరచన చేస్తున్నారు. ఈ నాయకుల్లో ఎక్కువ తక్కువ లుండవు. అందరూ సమానమే- ఒక సిట్టింగ్ బుల్ తప్ప. ఎందుకంటే అన్ని తెగల వాళ్ళూ అతణ్ణి తమ సుప్రీమ్ లీడర్ (అధినాయకుడు)గా భావిస్తారు.

రోజ్‌బడ్ వద్ద, అమెరికన్ సైనికులు శలభాల్లా రాలిపోలేదని సిట్టింగ్ బుల్‌కు తెలుసు. కాని-ఆనాటి పరాజయం తర్వాత, పౌడర్, బిగ్ హార్న్‌ల మధ్య ఒక్క సైనికుడు కూడా కనిపించలేదు.

కాని ప్రమాదం ముంచుకొస్తున్నది. లాంగ్ హెయిర్ కస్టర్ తన దళాలతో రోజ్‌బడ్ ప్రాంతంలో రహస్యంగా సంచరిస్తున్నాడని జూన్ 24 దాకా ఇండియన్లు తెలుసుకోలేకపోయారు. ఒక ఉదయం సడెన్‌గా తెలిసింది. సైన్యం రోజ్‌బడ్ దాటి, లిటిల్ బిగ్ హార్న్ వైపు కదిలి వస్తున్నదని.

"నలుగురు ఆడవాళ్లతో కలిసి నేను టర్నిప్‌లు తవ్వుతున్నప్పుడు దూరంగా దుమ్ము లేస్తున్న దృశ్యం కనిపించింది. గిట్టల చప్పుడు కూడా వినిపించింది. సైనికుల ఆయుధాల ఎండకు మెరిశాయి. మేం క్యాంపు వైపు పరిగెత్తాం" అత్యవసర సమావేశం జరుగుతున్నది వెళ్లమన్నాడో యువకుడు. కాని నడవటానికి కూడా సమయం లేదు. ఇంక సమావేశమెందుకు? కొందరు సియోలు, గుర్రాలెక్కి ఆయుధాలతో పరిగెత్తారు. స్త్రీలూ, పిల్లలూ ఇతర గుర్రాల మీద సురక్షిత స్థలాలకు పోవటానికి ప్రయత్నించారు.

సిట్టింగ్ బుల్‌కు వరుస సోదరి ప్రెటీ-సాన్-వేస్ట్- విన్ కూడా వుదయం టర్నిప్‌లు తవ్వుతున్న బృందంలో వుంది. 'మేం మొదట చూసినప్పుడు సైనికులు ఆరేడు మైళ్ల దూరంలో వుండి వుంటారు. కత్తులు, బరిసెలు కూడా కనిపించాయి' అని గుర్తు చేసుకుంది.

వీళ్ళంతా కస్టర్ బెటాలియన్. అదే సమయంలో, దక్షిణం నుండే, మేజర్ మార్కస్ రేనో తన కెవల్రీతో మరో దాడి చేశారు.

"ఇక చెయ్యగలిగిందేముంది? తూటాలకు టెపీలు తూట్లు పడ్డాయి. స్త్రీలు, పిల్లలూ హాహాకారాలు చేశారు. అన్ని తెగల యువకులూ చావు తప్పదని తెలిసి వీరోచితంగా సైనికులను ఎదుర్కొన్నారు. బ్లాక్‌ఫుట్ సియోలు యుద్ధ గీతాలు గానం చేశారు. ఆ పాటలతో గ్రామమంతా ప్రతిధ్వనించింది.

పదమూడేళ్ల ఓగ్లాలా కుర్రాడు బ్లాక్ ఎల్క్, లిటిల్ బిగ్‌హార్న్‌లోని చెరువులో ఈతకొడుతున్నాడు. ఎండ ఎక్కువగా ఉంది. నీళ్లలోనే వుండిపోవాలనిపిస్తున్నది. దూరంగా, హంక్‌పాపా క్యాంపు నుండి ఒక కేక వినిపించింది.

"హంతకులొస్తున్నారు.! తెల్లవాళ్ళొస్తున్నారు!" అంటూ అరిచాడు వార్తలను ప్రకటించే క్రయర్. క్షణాల్లో, అన్ని క్యాంపుల్లోనూ కేకలు మిన్నంటాయి.

ఇవి విన్న ఓగ్లాలా నాయకుడు లోడాగ్ మొదట తన చెవులను తానే నమ్మలేదు. సైనికులక్కడికెందుకొస్తారు! ఈ అడవిలో వాళ్ళకేం పని? పైగా, ఇన్ని వేల మంది మీద దాడి చేయడానికి సాహసిస్తారా!

ఎవడో కుర్రాడు చేసిన తుంటరి పనైవుంటుంది" అనుకుని, క్యాంప్ బయటకొచ్చి చూస్తే సిట్టింగ్ బుల్ వున్న టెపీ మీద బుల్లెట్ల వర్షం కురుస్తున్నది.

"రెనో ది దొంగ దాడి" అంటూ గుర్తు చేసుకున్నాడు మిన్నెకాంజూ నాయకుడు ఐరన్ థండర్.

నాలుగు వందల గజాల దూరం నుండి సైనికులు కాల్పులు జరిపారన్నాడు హంక్ పాపా నాయకుడు క్రోకింగ్. ఏ దాడిలోనైనా స్త్రీలను, పిల్లల్ని రక్షించటం ప్రథమ కర్తవ్యం. వాళ్లను సురక్షిత స్థానాలకు చేర్చి, పోరాటం కొనసాగించటం ఇండియన్ల యుద్ధనీతి.

మూడు మైళ్ళ దూరంలో, షెయెనీ క్యాంపు వద్ద గుర్రాలకు నీళ్ళు పెడుతున్నాడు

టూమూన్. "నేను కాసేపు ఈత గొట్టి, లాడ్జ్ వైపు నడిచి వస్తున్నప్పుడు సిట్టింగ్ బుల్ క్యాంప్ దగ్గర పొగ కనిపించింది. మరి కొద్ది క్షణాల్లోనే "సైనికులొచ్చేశారు" అంటూ ఎవరో కేకవేశారు.

స్త్రీలను దూరంగా వెళ్ళిపొమ్మని చెప్పి షెయెనీలతో ముందుకు కదిలాడు టూమూన్". "సిట్టింగ్ బుల్ క్యాంపు వద్ద యుద్ధం జరుగుతున్నది.

తెల్లవాళ్ళు (రెనో సైనికులు) ఆ టెపీని ముట్టడించారు. దట్టంగా పొగ నిండింది. మనుషులు సరిగా కనిపించటం లేదు. సియోల ధాటికి నిలవలేక పోయారనుకుంటారు. కాసేపట్లో, వేటగాళ్లను చూసి పరిగెత్తే దున్నల్లా కాలికి బుద్ధి చెప్పారు".

రెనో సైనికులను తరిమి కొట్టిన ఆ హంక్‌పాపా వీరుడి పేరు పిజిలేకగాల్. ముప్పై ఆరేళ్ల దృఢకాయుడతడు. గాల్ తల్లిదండ్రులెవరో తెలియదు. అనాథగా పెరిగాడు. బాల్యంలోనే ధైర్య సాహసాలు ప్రదర్శించిన ఈ కుర్రాణ్ణి సిట్టింగ్ బుల్ తన తమ్ముడిలాగా పెంచుకున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం (1868 నాటి ఒప్పదం ప్రకారం) ఇండియన్లు వ్యవసాయం చెయ్యాలని కమిషన్లు ఒత్తిడి తెచ్చినప్పుడు ఈ గాల్ ఒంటరిగా ఫోర్ట్ రైస్ కెళ్ళి "నగ్నంగా సంచరించే జాతి మాది. వేటాడి బతుకుతాం. మీరేమో మమ్మల్ని వ్యవసాయం చెయ్యమంటారు. ఇళ్లల్లో వుండమంటారు. మీరు సముద్రాలు దాటి ఇంత దూరం వచ్చారుగదా, అక్కడి మీ వాళ్ళు, మిమ్మల్ని వ్యవసాయం మాని వేటాడి మాలాగ జీవించమంటే. ఇళ్లకు బదులుగా ఆరు బయట టెపీల్లో వుండమంటే ఏం చేస్తారు? మీ హక్కుల కోసం మీరు పోరదరా?" అంటూ తెల్లవాళ్లను నిలదీశాడు. ఈ పదేళ్లలో సెట్లర్ల అహంకారం తగ్గలేదని కూడా అతడికి తెలుసు. 1876 నాటికి సిట్టింగ్‌బుల్ లెఫ్టినెంట్‌గా గాల్‌ను అందరూ గుర్తించారు.

రెనో సైనికుల కాల్పుల్లో ఎక్కువగా నష్టపోయింది గాల్ కుటుంబమే. స్త్రీలూ, పిల్లలూ అనేకమంది మరణించారు. 'ఆ సంఘటన నన్ను లోతుగా గాయపర్చింది. తరువాత శత్రువులను కేవలం గొడ్డలితో నరికేశాను" అని ఒక పత్రికా విలేకరిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడతడు.

'రెనో దాడి చేసినప్పుడు నేను, సిట్టింగ్ బుల్ పక్క పక్కనే కూర్చున్నాం. స్త్రీలను మొదట పడవల్లో కెక్కించి దూరంగా పంపించివేశాం. ఆ తర్వాత మేం గుర్రాలెక్కి వాళ్లూహించని చోట దెబ్బతీశాం.

మిలిటరీ పరిభాషలో, ఆనాడు గాల్, రెనో వ్యూహాన్ని అతడి మీదే ప్రయోగించి చిత్తుగా ఓడించాడమన్నమాట (ఇండియన్ల యుద్ధ చతురతకిదో ప్రముఖ దర్శనం). ఆ తర్వాత, గాల్ తన యోధులతో కస్టర్ బలగాల్నెదుర్కొన్నాడు. క్రేజీహార్స్, టూమూన్ కూడా తన మనుషులతో అమెరికన్లను పరుగెత్తించారు.

మరోవైపు, అంతకు కొద్దిసేపటి క్రితమే, ప్టే -సాన్ -వేస్ట్- విన్ ఇతర స్త్రీలూ, లాంగ్ హెయిర్ కస్టర్ సైనికులు రావటం పసిగట్టారు. "వాళ్ల బ్యూగుల్ శబ్దం వినిపించింది. ఆ తర్వాత గుర్రాల దండు కనిపించింది. సైనికులు నది దాటటం కూడా చూశాను. ఆ వెంటనే, షెయెనీలు యుద్ధనాదాలు చేస్తూ ముందుకురికారు. క్షణంలో సంకుల సమరం ఆరంభమైంది. వందలమంది సైనికులు - మా వాళ్ళు- మరికొన్ని వందల మంది సియోలు కూడా వచ్చి మాతో కలిశారు. సైనికులు కొండల్లోకి పారిపోయారు. మావాళ్ళు, వాళ్లను వెంబడించారు. రెండువైపుల నుండీ దాడి చేసి, చాలామందిని నల్లులా నలిపేశారు.

ఆ నాటి సంఘటనను, బ్లాక్‌ఫుట్ సియోల నాయకుడు, కిక్ ఈగల్ ఇలా గుర్తుచేసుకున్నాడు. "తుఫాను వచ్చినట్టనిపించింది. ఎటు చూసినా ఇండియన్లే...... తేనెతుట్టెను కదిపితే చెలరేగిన తెనెటీగల్లాగా". ఇండియన్ల ధాటికి సైనికులు ఎలా పరిగెత్తారో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఆనాడు మావాళ్ళు అరివీరభయంకరులై వాళ్లను పారదోలారు. అన్ని ఆయుధాలూ, యూనిఫారాలూ సైనికులను రక్షించలేక పోయాయి. మాకు గాయాలు తగలలేదని కాదు. నా గుర్రానికి గాయమైంది. ఓ బులెట్ నా కాలిలోకి దూసుకుపోయింది. మోకాలి చిప్ప వూడి వచ్చింది. కింద పడ్డాను" అని చెప్పాడు క్రోకింగ్.

"పొగ, దుమ్ము కొండల్ని కప్పేసింది. సైనికులు చాలా రౌండ్లు కాల్చారు. ధైర్యంగా ఎదురు నిల్చి సియోలు కూడా కాల్చారు. చాలా సేపు యుద్ధం జరిగింది. సాయంత్రానికి గాని తెలియలేదు. అనేకమంది సైనికులు మరణించారు. శవాలు చెల్లాచెదరుగా పడివున్నాయి. మేం నది దాటి కొండల్లోకెళ్ళి వెదికాం. మృతుల్లో లాంగ్ హెయిర్ కస్టర్ కూడా వున్నాడు. కారుతున్న నెత్తురు క్లాళకు వెచ్చగా తగిలింది"- అని సాక్ష్యం చెప్పింది ప్టె -సాన్ -వేస్-లిన్.

"మిగిలిన కొద్ది మంది తెల్లవాళ్ళు గుర్రాలు దిగి, ఆయుధాలు కిందపడేశారు. మేం వాళ్లను చుట్టుముట్టి, క్యాంపుదాకా తీసుకొచ్చి, కాల్చి చంపాం. సైనికులు బాగానే యుద్ధం చేశారు- వాళ్ళ ధైర్యం మాకు వచ్చింది" క్రోకింగ్.

అయితే, రెడ్ హార్స్ దీనితో విభేదించాడు.

సిట్టింగ్‌బుల్

"చివరగా, కస్టర్‌తో తలపడినప్పుడు, సైనికులు మూర్ఖంగా ప్రవర్తించారు. తుపాకులు కిందపారేసి, చేతులు పైకెత్తారు. "సియో వీరులారా, మా మీద కరుణించండి. బందీలుగా తీసుకోండి. కాని చంపొద్దు అంటూ వేడుకున్నారు" కాని వాళ్లతో సియోలకేం ఉపయోగం! అందుకే, అందర్నీ చంపేశారు".

చాలా రోజుల తర్వాత, మిన్నెకాంజూల వైట్‌బుల్ ఒక పిక్టోగ్రాఫ్ (చిత్రలిపి-అక్షరాలకు బదులు బొమ్మల ద్వారా వ్యక్తపర్చుకోవటం)లో కస్టర్‌తో తను ముష్టియుద్ధం చేసి చంపినట్టుగా చిత్రించాడు. "రెయిన్-ఇన్-ది-పేస్" ఫ్లాట్‌హిప్, బ్రేవ్ బేర్‌లు తాము కూడా కస్టర్ గొంతు నులిమి చంపామన్నారు. రెడ్‌హార్స్ ప్రకారం, నిజంగా కస్టర్‌ను చంపింది ఒక అనామక యోధుడు! యుద్ధంలో పాల్గొన్న ఇండియన్లలో చాలామంది అసలు కస్టర్ ఎవరో తెలియదన్నారు. అందువల్ల అతణ్ణి ఎవరు చంపారో తెలిసే అవకాశమే లేదు. "అతను సైన్యానికి నాయకుడని యుద్ధం ముగిసిన దాకా మాకు తెలియదు" అన్నాడు లోడాగ్.

"చాలా రోజుల తర్వాత, మిన్నెకాంజూల వైట్‌బుల్ ఒక పిక్టోగ్రాఫ్ (చిత్రలిపి-అక్షరాలకు బదులు బొమ్మల ద్వారా వ్యక్తపర్చుకోవటం)లో కస్టర్‌తో తను ముష్టియుద్ధం చేసి చంపినట్టుగా చిత్రించాడు. "రెయిన్-ఇన్-ది-పేస్" ఫ్లాట్‌హిప్, బ్రేవ్ బేర్‌లు తాము కూడా కస్టర్ గొంతు నులిమి చంపామన్నారు. రెడ్‌హార్స్ ప్రకారం, నిజంగా కస్టర్‌ను చంపింది ఒక అనామక యోధుడు! యుద్ధంలో పాల్గొన్న ఇండియన్లలో చాలామంది అసలు కస్టర్ ఎవరో తెలియదన్నారు. అందువల్ల అతణ్ణి ఎవరు చంపారో తెలిసే అవకాశమే లేదు."

ఏడాది తర్వాత, కెనడాలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కస్టర్‌ను చూడలేదన్నాడు సిట్టింగ్‌బుల్. అయితే, చివరి క్షణాలలో, అతణ్ణి గుర్తించి మరీ మట్టుబెట్టారు ఇతర యోధులు. "అతణ్ణి లాంగ్ హెయిర్ కస్టర్" అని పిలిచేవాళ్ళు. కాని ఆ రోజు అతడికి పొట్టి జుత్తే వుంది- మంచు పడిన గడ్డిలా మెరవటం కూడా చూశాను. రక్షణ కవచంగా వున్న సైనికులందరూ నేలకొరిగాక, వదలిపోయిన మొక్కజొన్న కండెలా నిల్చున్నాడు" అంటూ వర్ణించాడు.

ఇంకా వుంది....

చందు



అది

రింగ్ టోన్ అయినా సరే... కాలర్ టోన్ అయినా సరే ... 'అరెరె... అరెరె... మనసే జారే... అరెరె... అరెరె... వరసే మారే... ఇదివరకెపుడు... లేదే... ఇది నా మనసే కాదే...' పాట వినగానే మనసులో ఏదో తెలీని పరవశం. అలసట మర్చిపోతాం. సంగీతానికి రాళ్ళు కరుగుతాయన్న మాట ఏమోగానీ... మనసు మాత్రం కరుగుతుంది. గత ఏడాది ఎవరి నోట విన్నా 'హ్యాపీ డేస్' చిత్రం గురించే... ఈ సినిమా ఎంత సూపర్ హిట్ అయిందో, అందులోని పాటలు కూడా అంతే ఆదరణ పొందాయి. టైటిల్ సాంగ్ మినహా పాటలన్నీ 'వనమాలి' రాశారు. తెలుగులో పి.హెచ్‌డి చేసిన ఆయన అసలు పేరు డాక్టర్ మణిగోపాల్. జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకుని చిన్నప్పటి నుంచీ తనకిష్టమైన పాట వైపు పయనించారు. తెలుగు చిత్రసీమలో తనకంటూ ఒక స్థానాన్ని పదిలం చేసుకుంటున్న వనమాలితో జరిపిన ముచ్చట్లు...

చులకన భావం పోయి మమకారం పెరిగింది

నాన్నగారి పేరు గోపాలకృష్ణన్. అమ్మ శాంత కుమారి. కడప జిల్లా రైల్వే కోడూరులో పుట్టాను. చిత్తూరులో ఇంటర్, డిగ్రీ చదివాను. చెన్నయ్‌లో ఎం.ఎ., పి.హెచ్‌డి పూర్తి చేశాను. ఇంటర్, బి.యస్సీలో సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ తీసుకున్నాను. లైబ్రరీకి ఎక్కువగా వెళ్తుండేవాణ్ణి. డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉండగా లైబ్రరీ టేబుల్‌పై డా।। సి. నారాయణరెడ్డిగారు రాసిన 'ఆధునిక ఆంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోగములు' అనే పుస్తకం చూశా. సి.నా.రె. పి.హెచ్‌డి థీసిస్ పుస్తకమది. అందులో శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి... కవితలు నన్ను బాగా ఆకర్షించాయి. శ్రీశ్రీ రచనలు ఉత్తేజపరిచాయి. నాలుగైదు పేజీలు చదివానో లేదో లైబ్రరీ క్లోజ్ చేసే టైం అయింది. పుస్తకాన్ని భద్రంగా ఓ చోట దాచి మరుసటి రోజు చదివాను. సుమారు 650 పేజీల ఆ పుస్తకాన్ని పది పదిహేను రోజుల్లో పూర్తిచేశా.

పొద్దున లేస్తే మనం రోజూ తెలుగే మాట్లాడుకుంటాం కదా! ప్రత్యేకంగా తెలుగు చదవాలా? అన్న తేలికపాటి భావన మనసులో ఉండేది. తెలుగంటే ఆషామాషీ కాదని సినారె పుస్తకం చదివాక తెలిసింది. అందులోని పటిష్టమైన తెలుగు రచన నన్నాకర్షించింది. లబ్దప్రతిష్ఠులైన మహానుభావుల సాహిత్యం పట్ల మమకారం పెరిగింది. ఆ తర్వాత ఏ దిన పత్రిక చదివినా... ఏ మ్యాగజైన్ తిరగేసినా... ముందు సాహిత్యం పేజీలోకి వెళ్ళిపోయేవాణ్ణి. సి.నా.రె రచన తెలుగుపై అభిమానం కలిగించింది. తెలుగంటే విపరీతమైన ఇష్టం పెరిగిపోయింది. ఎం.ఎ తెలుగు చేయాలన్న నిర్ణయం మనసులో బలంగా పడిపోయింది. డిగ్రీలో సెకండ్ లాంగ్వేజ్ హిందీ కావడంతో ఎం.ఎ తెలుగు తీసుకోవడానికి అనర్హుణ్ణి అయ్యాను. ఎలాగైనా ఎం.ఎ తెలుగులో చేరాలన్న దృఢ సంకల్పంతో సింగిల్ సిట్టింగ్‌లో మూడు సంవత్సరాల బి.ఏ తెలుగు లిటరేచర్ పూర్తి చేశాను. 16 సబ్జెక్ట్స్ ఒకేసారి రాసి 64 శాతం మార్కులతో పాసయ్యాను. మద్రాస్ యూనివర్సిటీలో ఎం.ఏలో చేరాను. ఈలోగా కవిత్వం రాయడం ప్రారంభించాను. దూరదర్శన్‌కు లలిత గీతాలు రాశాను.

తొలిసారి పేపర్లో నా ఫొటో...

ఎం.ఎ చదువుతున్నప్పుడు సాహిత్య సమ్మేళనాలకు హాజరుకావడంతో... ఆరుద్ర, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి, భువనచంద్ర, వెన్నెలకంటి, రావి కొండలరావు, జగ్గయ్య, పి.బి. శ్రీనివాస్, పైడిపాల వంటి గొప్పోళ్ళతో పరిచయం ఏర్పడింది. జీవితంలో వీళ్ళని కలుస్తాననిగానీ, అసలు చూస్తాననిగానీ అనుకోలేదు. కలలో కూడా ఊహించని టర్నింగ్ పాయింట్ అది. ఎం.ఎ.లో గోల్డ్ మెడల్ వచ్చింది. మనస్విని ట్రస్ట్ వారు బెస్ట్ స్టూడెంట్‌కి ఇచ్చే ఉపకార వేతనం రెండు సంవత్సరాలూ నాకే వచ్చింది. నటులు జగ్గయ్యగారి నుంచి ఈ పురస్కారం అందుకుంటున్న ఫొటోను ఈనాడులో వేశారు. పేపర్లో నా ఫొటో చూసుకోవడం అదే తొలిసారి.

మద్రాసు ఆకాశవాణికి కవితలు పంపించేవాణ్ణి. వాళ్లకి ఏం కావాలన్నా ఎం.ఎ తెలుగు స్టూడెంట్స్‌నే పిలిచేవాళ్ళు. అలా ఆకాశవాణికి ఆస్థాన కవినైపోయాను. పి.జి పూర్తవడం... నాన్నగారు రిటైరవ్వడం ఒకేసారి జరిగాయి. మేం నలుగురు సంతానం. అన్నయ్య ఇంజనీరింగ్, రెండో అన్నయ్య బి.కాం, చెల్లి ఎం.ఎ (ఇంగ్లీష్) చదివారు. బాగా చదువుకుంటే మా కాళ్ళ మీద మేం నిలబడతామన్న నమ్మకంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతూనే నాన్న అందర్నీ చదివించారు. నాన్న కష్టం మీదే అందరం బతకాలి. అమ్మ హౌస్ వైఫ్. ఎం.ఎ తర్వాత పి.హెచ్‌డి చేయాలని ఉండేది. కానీ డబ్బు సమస్య. రిటైర్ అయిన నాన్నను ఇంకా ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. అదే టైంలో... మద్రాస్‌లో పని చేయడానికి రిపోర్టర్స్ కావాలంటూ ఈనాడులో యాడ్ పడింది. అప్లయ్ చేశాను. ఉద్యోగం వచ్చింది. దీంతో హాస్టల్లో ఉంటూ... జాబ్ చేస్తూ... పి.హెచ్‌డి చదివాను. ఇక ఇంటికి నేనే డబ్బులు పపండం మొదలుపెట్టాను. 'నూతలపాటి గంగాధరం సాహిత్య జీవితం' అంశం మీద పి.హెచ్‌డి చేశాను. డాక్టర్ మణిగోపాల్ అయ్యాను.

భాష కంటే భావమే మిన్న

సినిమా పాటలు రాయాలని ఎప్పుడూ ప్రయత్నించలేదు. అసలా భావనే లేదు. నాన్నగారు ఘంటసాల పాటలను అచ్చు గుద్దినట్లు పాడేవారు. ఇంట్లో ఎప్పుడూ పాటల సందడే. ఆయన పాటతోనే మాకు తెల్లారేది. ఆయన ప్రేరణతో... పాటలన్నింటినీ నోటికొచ్చేదాకా ప్రాక్టీస్ చేసేవాణ్ణి. నేనొక తమిళియన్ అయినా తెలుగు పాటంటే ఎనలేని ప్రేమ. నిజం చెప్పాలంటే.. తమిళం కన్నా తెలుగంటేనే ఇష్టం. తమిళియన్స్‌లో భాషా దురభిమానం ఉంటుంది. ఈ విషయమై వాళ్ళతో ఎప్పుడూ వాదిస్తుంటా. నీది గొప్ప.. నాది గొప్ప అని చర్చకు దారితీసిన సందర్భంలో భాష కన్నా భావం గొప్పదని వాదించేవాణ్ణి. ప్రపంచంలో ఎక్కడకు వెళ్ళినా భావమే ఉన్నతంగా ఉంటుంది. భాష అనేది వాహనంలా నడిపించడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. గమ్యం చేరామా? లేదా? అన్నది ముఖ్యంగానీ దేని మీద వెళ్ళామో అప్రస్తుతం. అలాగే భాష కంటే భావమే మిన్న.

(మరిన్ని కబుర్లు వచ్చేవారం)

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

చిన్న గదిలో ముగ్గురం చదువుకోవాలా!

నేను గ్రూపు 1 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఇప్పుడు బాగా చిన్న ఇంటిలోకి మారాము. అక్కడ ఒకే గదిలో నేను తమ్ముడు, చెల్లి చదువుకోవాల్సి వస్తోంది. దానితో నా చదువు సాగడం లేదు. ఏమి చెయ్యాలో సలహా ఇవ్వండి?

పార్వతి, పాలకొల్లు.

మధ్య తరగతి కుటుంబాలలో ఈ సమస్యలు ఉంటూనే ఉంటాయి. అర్థం చేసుకోకపోవడం మీ అపరిపక్వతను తెలియజేస్తుంది. మీ చదువు కోసం మీ తల్లి దండ్రులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో గమనించారా! మీ సమస్య గదికి సంబంధించినదా! స్థల మార్పిడి వల్ల అలా అనిపిస్తుండవచ్చు! వాళ్ళు చదువుకునే టప్పుడు మీ స్నేహితుల రూమ్స్‌కి వెళ్ళండి. లేదా బయట కూర్చుని చదువుకోండి. తమ్ముడు, చెల్లి పడుకున్న తర్వాత లేదా స్కూలుకి వెళ్ళిన తరువాత చదువుకోండి. 'సమస్యలు ఎలా ఉన్నా చదవగలను' అనే నమ్మకమే మిమ్మల్ని బాగా చదివేలా ప్రోత్సహిస్తుంది. అవకాశాన్ని బట్టి చదవడానికి అలవాటు పడండి. మీ సమస్యను మీ తల్లిదండ్రులకు తెలియజే యండి. మీరు చదివి మంచి ర్యాంకు సంపాదిస్తే దానికి తగిన విధంగా ఉద్యోగం వస్తుంది. అప్పుడు మీకు తగిన విధంగా పెద్ద ఇల్లు తీసుకోగలుగుతారు. సమస్యలను పట్టించుకోకుండా మీ దృష్టిని చదువు మీద నిలపండి. ఆల్ ది బెస్ట్.

ప్రేమను ఆకర్షణ అని మాత్రం చెప్పొద్దు...

నా పేరు మాధవి. నేను ఇంటర్ బై.పి.సి రెండవ సంవత్సరం చదువుతున్నాను. నేను ఒకతడిని ప్రేమించాను. తొందరపాటు వల్ల నా పుట్టిన రోజునాడు నేను అతను శారీరకంగా దగ్గరయ్యాం. హైదరాబాద్‌కి పారిపోయి వచ్చి పెళ్ళి చేసుకున్నాం. 18 సంవత్సరాలు నిండక పోవడంతో మైనర్‌ని అని నన్ను మా తల్లి దండ్రులకు అప్పగించారు. ఒకతే కూతుర్ని. అయితే నన్ను ఇంకా చదివిస్తున్నారు. మా ప్రేమని ఆకర్షణ అని మాత్రం చెప్పొద్దు. వేరే పెళ్ళి చేసుకొని చదువు కంటిన్యూ చేయడం నాకిష్టం లేదు. నాకు మంచి సలహా ఇవ్వగలరు?

మాధవి, వరంగల్.

మీలో ఉన్న లవ్‌ని రొమాంటిక్ లవ్ అంటారు. ఈ లవ్ ఉద్వేగం- ఉద్రేకం - ఉత్తేజం ఎక్కువ కాలం నిలవదు. కొంత కాలానికి అది చల్లారిపోతుంది. అందుకే మీ ఇద్దరూ శారీరకంగా దగ్గరయ్యారు. వాస్తవిక ప్రేమను 'కంపెనియోనెట్ లవ్' అంటారు. ఇది నిలకడైనది. దూకుడు లేనిది. ఈ దశలో ప్రేమికులు ఒకరిపై ఒకరికి అభిమానం, అనురాగం ఆప్యాయత- నమ్మకం- కలిసి జీవించాలనే కోరిక ఉంటాయి. మీరు ఇంకా మైనర్ కాబట్టి మీ వాళ్ళు పెళ్ళి చేయలేరు. మీ కుటుంబీకులతో చదువు పూర్తి అయ్యే వరకు చేసుకోనని గట్టిగా చెప్పండి. మీ తల్లిదండ్రులు మీ మీద నమ్మకంతో



చదివిస్తున్నారు. కాబట్టి వాళ్లను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ముందు నీవు అతని సంస్కృతిని, సాంప్రదాయాలను, కుటుంబ కట్టుబాట్లను తెలుసుకో. ఈ లోపు అతను సెటిల్ అవుతాడు. మీ చదువు పూర్త వుతుంది. మీ ప్రేమలో వాస్తవికత ఉంటే మీరిద్దరూ రెండు మూడు సంవత్సరాలు ఓపిక పట్టండి. మీరు మేజర్ అయితే అప్పుడు మీ భర్త దగ్గరకు వెళ్ళవచ్చు. అప్పటివరకు చదవు మీద దృష్టి పెట్టు. మీ నమ్మకమే మీ ఇద్దరినీ కలుపుతుంది. మీ తల్లిదండ్రులను ఒప్పించి పెళ్ళి చేసుకోవడం వల్ల నువ్వు జీవి తాంతం ఆనందంగా ఉండగలుగుతావు. మీ వాళ్లు అర్థం చేసుకునే విధంగా నువ్వు, నీ బాయ్ ఫ్రెండ్ ప్రవర్తించండి. మీ మంచి ప్రవర్తనే మీ తల్లిదండ్రులు మిమ్మల్ని కలప డానికి దోహదం చేస్తుంది. ఆల్ ది బెస్ట్.

పాప నన్ను వదిలి క్షణం వుండలేదు

మా పాప వయసు ఆరు సంవత్సరాలు. నన్ను వదిలి ఒక్కక్షణం ఉండదు. నేను బయటకు వెళ్ళి వచ్చే వరకు ఏడుస్తూనే ఉంటుంది. నేను పక్కలో లేకపోతే నిద్రపోదు. స్కూలుకి వెళ్ళనని మారాం చేస్తుంది. నాకు ఏమి చెయ్యాలో తెలియడం లేదు. సలహా ఇవ్వగలరు.

ప్రసన్న, విజయనగరం.

ఈ సమస్యను "సెపరేషన్ యాంక్జైటీ" అంటారు. సాధారణంగా ఈ లక్షణాలు చిన్న పిల్లలలో వుంటాయి. అయితే వయసు పెరిగిన కొద్ది తగ్గిపోతాయి. తల్లులు భయపడుతున్నా, అతిగారాబం చేసినా పిల్లలు తల్లిని వదలరు. తమకు ఏమైనా ప్రమాదాలు జరుగుతాయని, తప్పిపోతామని, ఎవరైనా ఎత్తుకు పోతారేమో అని భయపడడం వలన పిల్లలు తల్లిని వదలరు. భయంకరమైన కలలు రావడం, నిద్ర పట్టకపోవడం, తమ్ముడు చెల్లి పుట్టినప్పుడు తల్లి తనను పట్టించుకోవడం లేదనే అనుమానం వచ్చినా వదలరు. మీరు మీ పాపతో ఆటలు ఆడటం ధైర్యంగా ఉండే చక్కని కథలు చెప్పడం, ఓపిక, సహనంతో మెల్ల మెల్లగా స్కూలుకు వెళ్లేటట్లు చేయడం, తన స్నేహితుల ఇంటికి తీసుకువెళ్ళడం అప్పుడప్పుడు మీరు వెళ్ళి టీచర్స్‌తో మాట్లాడడం, అవసరమైతే ప్రతి రోజు మీరే స్కూల్ దగ్గర దింపడం, తీసుకురావడం చెయ్యండి. తల్లి స్పర్శ పిల్లలను ధైర్య వంతులుగా చేస్తుంది. ఎక్కువగా దగ్గరకు తీసుకురావడం, ముద్దు పెట్టుకోవడం, మీరే పాప శరీరానికి నూనె రాసి స్నానం చేయించండి. చక్కగా మీ పాపలో మార్పు వస్తుంది. కౌన్సెలింగ్ సైకాలజిస్టును కలవండి.

బాలనేస్తాలు



సూర్యుడు ఏడీ.....

హాయ్ పిడుగులూ... వేసవి కాలం స్పెషల్ ఏంటో చెప్పకోండి. ఆ... చెమట. సూర్యుడు ప్రసరింపచేసే వేడికి మనందరికీ ఒకటేమని చెమటలు పోస్తాయి. ఇదిగో ఈ బొమ్మలో బోలెడంత మంది చెమటలు కక్కుతున్నారుకదూ. అయితే అందుకు కారణమైన భానుడు (సూర్యుడు) కూడా వారిలోనే వున్నాడు. ఎక్కడున్నాడో కనుక్కోండి చూద్దాం. ఎంతకీ తెలీకపోతే మాత్రం మా సమాధానంచూడండే.

ఎవరి గాలిపటం తెగింది?



పూరిద్దాం

ఇదిగో నేస్తాలూ... ఇక్కడ మీకు బాగా పరిచయమైనవి మూడు వున్నాయి. చూడగానే వాటి పేర్లు టకటకామని చెప్పేస్తారు. మరి వాటిని ఇంగ్లీషులో అక్కడ వున్న గళ్లల్లో పూరించాలి. అంతా అయ్యాక మా జవాబు చూడండే.

(జవాబు: rocket, star, moon)

బెలూన్ ఆట

నేస్తాలూ! ఇవాళ మీకు ఒక ఆట గురించి చెప్పాలనుకుంటున్నాం. అదీ మీకెంతో ఇష్టమైన బెలూన్‌తో ఆడుకునే ఆట. మరి సంతోషమేనా? అయితే మొదలెట్టేద్దాం. ఈ ఆటను ఏదైనా పార్టీ సందర్భంగా ఆడుకోవచ్చు. సెలవుల్లో అయినా ఓకే. ముందుగా మీ ఫ్రెండ్స్ అందరికీ బూరలు ఇవ్వాలి. గాలి ఊద మనాలి. పూర్తిగా బూర నిండా గాలి ఊదాక చివర ముడి వేయాలి. అప్పుడు వుంటుంది అసలు మజా. ఇప్పుడు ఎవరైతే బూరను ముందుగా పగలకొడతారో వారే గెల్చినట్టు. బూర పగలగొట్టడానికి ఒక్కొక్కరు పడే పాట్లు చూస్తే భలేగా నవ్వొస్తుంది. ఆడేవారే కాకుండా ఆటను చూచే వారు కూడా ఎంతో సంతోషిస్తారు. ఈ మాట మీరూ ఒప్పకుంటారులెండి తర్వాత.





మేం చెప్పిన రంగులద్దండే

ఇక్కడ గీతల్లో ఒకరు దాక్కున్నారు. వారెవరో చెప్పాల్సింది మాత్రం మీరే. తెలియాలంటే... ఒక పని చేయాలి. ఏంటంటే... రంగులు అద్దాలి. అదీ మేం చెప్పినవి. రెడీనా. చుక్క ⊙ వున్న చోట నలుపు, ప్లస్ (+) వున్న చోట బులుగు అద్దాలి. మరి రెచ్చిపోండీ...

చుక్కలు కలిపేస్తే పోలా!





పక్షి పేరేంటో...

ఫ్రెండ్స్! ఇక్కడ ఒక కోడి వుంది. దాని పేరు మీరే చెప్పాలి. ఆ... అందుకు మేం కొన్ని ఆధారాలిస్తాం. కోడి కింద వస్తువులు, ప్రాణులు, తినుబండారాలు వున్నాయి కదా. అదే వరుసలో వాటి తొలి అక్షరాన్ని రాస్తే సరి. కోడి పేరు వచ్చేస్తుంది. తెలీకపోతే మా ఆన్సర్ చూడండే.

(ఆన్సర్: moorhen)నీటి కోడి

ఎస్. షరీఫ్, 9వ తరగతి, పూతలపట్టు, జడ్‌పి స్కూల్, చిత్తూరు.



పి.బాబా, 8వ తరగతి, గురుకుల పాఠశాల, ఇబ్రహీంపట్నం.



సిహెచ్. అలేఖ్య, 8వ తరగతి, జడ్.పి.ఎస్.ఎస్ హైస్కూల్, జూలూరుపాడు, ఖమ్మం.

కథా నిలయం
శ్రీకాకుళం

ఉగాది ఊసులు



అంజన .కె

వసంత రుతువు...

రుతువులన్నిటిలోకి శోభాయ మానమైనది. చైత్రం, వైశాఖ మాసాల్లో వస్తుంది. చెట్లు చిగుర్చి, మొగ్గ తొడిగి, పూలు పూచి, కాయలు కాచి... నిండుగా కన్నుల పండుగగా కనిపిస్తాయి. వీటికి తోడు పూలలోని మకరందాన్ని ఆస్వాదించడానికి వచ్చే తుమ్మెదల ఝుంకారం. లేత మామిడి చిగుళ్లను ముక్కుతో చిలిపిగా కొరుక్కుతినే కోయిలల కుహూ రావాలు, మనసును మైమరపించే సుమాల సువాసనలు! ఎక్కడ చూచినా పచ్చదనం...రంగుల మయం. ప్రకృతి కాంత చిలకపచ్చ కోక కట్టి కొత్త సొబగులతో వయ్యారాలు వలకబోస్తున్నట్టు వుంటుంది. పరవశింపచేసే ఇలాంటి వాతావరణాన్ని అణువణువునా నింపుకున్న చైత్ర మాసం తొలిరోజును సంవత్సరాది పాడ్యమిగా భావిస్తాం. ఉగాది పండుగ జరుపుకుంటాం. ఇదే తెలుగువారి తొలి పండుగ. కొత్త సంవత్సర వేడుక.

మనలాగే మన పొరుగు రాష్ట్రాలలో కూడా... ఉగాది (కొత్త సంవత్సర) వేడుకలను వేరు వేరు మాసాలలో ... రకరకాల పండుగల పేర్లతో జరుపుకుంటారు. వారి సాంప్రదాయాలు... విశ్వాసాలు... చిత్రవిచిత్రగా వుంటాయి. ఆ విశేషాలేంటో చూద్దామా....

యుగాది... యుగ, ఆది అన్న పదాల కలయిక. యుగారంభం అని అర్థం. యుగాదే వాడుకలోకి వచ్చేసరికి ఉగాది అయ్యింది. ఇది కొత్తదనానికి సంకేతం. నవ జీవితానికి చిహ్నం. ఆకులు రాల్చే శిశిరం ముగిసి ఆనాటితో వసంతం మొగ్గ తొడుగుతుంది. ప్రకృతి కొత్త సొబగులను సంతరించుకుంటుంది. ఉగాదినే మనం సంవత్సరా రంభంగా భావిస్తాం.

చైత్ర శుద్ధ పాడ్యమి నాడు తెలుగువారిమైన మనం ఉగాది పండుగ జరుపుకుంటాం. తిథుల ప్రకారం మనం ఈనెల ఏడవ తేదీన ఉగాది జరుపుకోబోతున్నాం. 'సర్వజిత్తు' నామ సంవత్సరం నుంచి 'సర్వధారి' నామ సంవత్సరంలోకి అడుగెట్టబోతున్నాం.

అసలు ఉగాది అనగానే మదిలో మెదిలేది ఉగాది పచ్చడి. మామిడి, చింతపండు, వేప పువ్వు, కొత్త బెల్లం, చెరకు, ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలతో ఈ పచ్చడి తయారు చేస్తారు. షడ్రుచుల సమ్మిళతమైన ఈ పచ్చడి 'జీవితమంటే... కొంచెం సంతోషం...కొంచెం దుఃఖం, కొంచెం ఉద్రేకం...కొంచెం వైరాగ్యంరా బాబూ. అన్నిటినీ ఒకేలా స్వీకరిస్తూ ముందుకు నడవాలి' అని చెప్పకనే చెప్తుంది. ఇకపోతే కార్టూనిస్టులకు చేతి నిండా పని కల్పించేది కూడా ఈ పచ్చడే.

ఉగాది రోజున ఇంటిని శుద్ధిచేసి... గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి... తలంటి స్నానాలు చేసి ...కొత్త బట్టలు కట్టుకుని... దేవాలయాలకు వెళుతుంటారు. అక్కడ పంచాంగ శ్రవణం వుంటుంది. పంతు లుగారు రాబోయే సంవత్స రంలో జరిగే మంచి చెడులను, వర్షాలను, పంట దిగుబడులను గురించి చెప్తారు. పైగా ఆరోజున సాహితీ చర్చలు, కవితా గోష్టులు నిర్వహిస్తారు. సాహితీ రంగంలో ఎనలేని కృషి సల్పిన వారికి అవార్డుల ప్రదానం జరుగుతుంది.

'గుడి పద్వా'...మరాఠీల ఉగాది

మహారాష్ట్రలో కొత్త సంవత్సర ఆరంభంనాడు 'గుడిపద్వా' (మార్చి -ఏప్రిల్) పండుగ జరుపు కుంటారు. ఇది మరాఠీలకు ఎంతో ముఖ్యమైన రోజు. పెద్ద పండుగ. మరాఠీలకు ఎంతో ప్రీతిపాత్రుడైన ఛత్రపతి శివాజీ సేనలు యుద్ధంలో విజయం సాధించి నివాసానికి చేరుకున్నది ఆరోజేనని చెప్తుంటారు. వీరు ఉదయాన్నే లేచి కొత్త బట్టలు వేసుకొని ఇళ్లను అలంకరిస్తారు. ఇంటి ముందర బియ్యపు పిండి, రంగులతో ముగ్గులు వేస్తారు. 'గుడీ' తయారు చేసి కిటికీలకు



వైశాఖి సందర్భంగా...

తగిలించి పూజిస్తారు. ఒక వెదురు కర్రకు వేపాకులు, బంతి పూలు, రంగు రంగుల పట్టు బట్ట కట్టి ... వెండి చెంబు తగిలిస్తారు. ఇదే 'గుడీ'. దీన్ని మరాఠీలు విజయానికి చిహ్నంగా భావిస్తారు. 'గుడీ' దుష్టశక్తులను పారదోలుతుందని, శుభం చేకూరుస్తుందని భావిస్తారు. నేతిలో వేయించిన వేపాకులను, పప్పు... పంచదారతో కలిపి తింటే శుభప్రదమని, ఆరోగ్యదాయకమని కూడా భావిస్తారు.

'వైశాఖి'...సిక్కుల ఉగాది

సిక్కులు ఎంతో ఉత్సాహంగా, ఘనంగా జరుపుకునే పండుగలలో మొదటిది 'వైశాఖి'. సిక్కుల ఉగాది ఇదే.

అంటే నూతన సంవత్సర పండుగ. పంజాబ్, హర్యానాలోనే కాక ప్రపంచంలో వున్న సిక్కులందరూ ఈ పండుగను ఎంతో ఇష్టంగా జరుపుకుంటారు. రబి పంటలు కోతకు వచ్చే సమయం కావడంతో...వారు భాంగ్రా, గిద్ద నృత్యాలు చేస్తూ పండుగ సంబరాల్లో పాల్గొంటారు. ఈ పండుగను వైశాఖ (ఏప్రిల్-మే) మాసం తొలి రోజున జరుపు కుంటారు. ఇంగ్లీషు క్యాలెండర్ ప్రకారం ప్రతి సంవత్సరం ఇది ఏప్రియల్ 13న వస్తుంది. అయితే ప్రతి 36 సంవత్సరాలకోసారి ఏప్రిల్ 14న వస్తుంది.

సిక్కులకు ఎంతో ఇష్టమైన, పవిత్రమైన ఈ పండుగ రోజు... అందరూ ఉదయాన్నే లేచి పండుగ ఏర్పాట్లు చేస్తారు. పవిత్రనదీజలంతో స్నానంచేసి...కొత్త బట్టలు వేసుకుంటారు. అనంతరం సమీపంలో వున్న గురుద్వారాకు వెళ్లి పూజలు చేస్తారు. ప్రత్యేకంగా తయారుచేసిన 'కారా' ప్రసాదాన్ని తీసుకుంటారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తారు. ఆ తర్వాత పిల్లలు, పెద్దలు, మహిళలు అందరూ కలిసి భక్తి గీతాలు ఆలపిస్తూ.... భాంగ్రా నృత్యాలు చేస్తూ ప్రదర్శనగా వెళ్తారు.

'బొహాగ్ బిహు'...అస్సామీల ఉగాది

అస్సాం వాసులు 'బొహాగ్ బిహు' (రంగోలీ బిహు) పండుగను కొత్త సంవత్సర వేడుకగా భావిస్తారు. ఇది వీరి జాతీయ పండుగ. ఏప్రిల్ 13న బొహాగ్ బిహు ఉత్సవాలు ప్రారంభిస్తారు. బిహు పండుగను మూడు దఫాలుగా జరుపుకుంటారు. ఒకటి బొహాగ్ బిహు, రెండు కాటి బిహు (అక్టోబర్/ నవంబర్ మాసాల్లో). మూడు మాఘ బిహు (జనవరి మధ్యలో). వీటిలో బొహాగ్ బిహు


'పుతండు' సందర్భంగా ...

ప్రధానమైనది. ఈరోజున పొలాల్లో విత్తనాలు చల్లుతారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలలో మునిగి తేలతారు. బొహాగ్ బిహు తొలిరోజున గోపూజ చేస్తారు. కుర్రకారు 'బిహు గీతాలు' ఆలపిస్తారు. సంప్రదాయ 'ముకోలీ బిహు' నృత్యం చేస్తారు. యువకులు పనిలో పనిగా తమ మనసుకు నచ్చిన అమ్మాయిని ఎంపిక చేసుకుంటారు. వరిపిండితో చేసిన తీపి వంటకాలు ఆరగిస్తారు. బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి బహుమతులు, తీపి పదార్థాలు ఇచ్చిపుచ్చు కుంటారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటారు. సంప్రదాయ నృత్య పోటీలు నిర్వహిస్తారు. ఉత్తమ నాట్యకారిణికి 'బిహు కన్వారి' బిరుదు ఇస్తారు. మాఘ బిహు రోజు కోతలు మొదలుపెడతారు.

'గుడీ'

'విషు' మళయాళీల ఉగాది

అందమైన తీరప్రాంతంతో నిత్యం పచ్చగా కళకళలాడే రాష్ట్రం కేరళ. మళయాళీలు 'మేదం' నెల మొదటి రోజున 'విషు' పండుగ జరుపుకుంటారు. మే నెల మధ్యలో వస్తుంది. ఇదే వారి కొత్త సంవత్సర వేడుక. ఉదయాన్నే లేచి శుభ్రంగా తయారై ఆలయాలకు వెళతారు. సంప్రదాయ 'కోడి వస్త్రం' (కొత్త బట్టలు) ధరించి టపాసులు కాలుస్తారు. రుచికరమైన వంటకాలు చేసుకుని ఆరగిస్తారు. బంధుమిత్రులతో కలిసి భోజనం చేస్తారు. ఉగాది రోజున కేరళ వాసులు సంప్రదాయ 'కాని కనల్' పద్ధతిని తప్పక ఆచరిస్తారు. రాబోయే సంవత్సరంలో జరగబోయే మంచి ...ఆ రోజు ఉదయాన్నే తొలిసారిగా


గుడిపడ్వా

నవవర్ష

ఉగాది పచ్చడి

ఉగాది నాడు ఉగాది పచ్చడి తిన్నాకే మరేదైనా తీసుకుంటాం. మరి అలాంటి పచ్చడి ఎలా తయారుచేయాలో ఓసారి చూద్దాం.

కావలసిన పదార్థాలు

వేప పూలు- రెండు టేబుల్ స్పూన్లు, బెల్లం తరుగు- నాలుగు టేబుల్ స్పూన్లు, చింతపండు-మూడు టేబుల్ స్పూన్లు, ఆవాలు-పావు టేబుల్ స్పూను, కారం-చిటికెడు, ఉప్పు- రుచిని బట్టి, నూనె- ఒక టేబుల్ స్పూన్, మామిడి ముక్కలు-ఒక టేబుల్ స్పూను, నీళ్లు-1-1/4.

తయారు చేసే విధానం

చింతపండును అర్థగంట సేపు నీళ్లల్లో నానబెట్టాలి. నీళ్లను ఐదు నిముషాల పాటు వేడిచేయాలి. చల్లారాక గుజ్జు అయ్యేలా పిసికి పిట్టు తీసేయాలి. ఇప్పుడు చింతపండు పులుసులో మామిడి ముక్కలు కలపాలి. మామిడి ముక్కలు కొద్దిగా మెత్తబడే వరకు వేడిచేయాలి. తర్వాత బెల్లం కలిపి చల్లారనివ్వాలి. నూనె కాగనిచ్చి ఆవాలు వేయండి. అవి చిటపటలాడాక వేప పువ్వును కలపండి. అవి బంగారు వర్ణంలోకి వచ్చాక...ఉప్పు, కారం కలపాలి. చివరిగా వేప పువ్వును చింతపండు పులుసులో కలపాలి. అంతే ఉగాది పచ్చడి రెడీ. ఇక వడ్డించడమే తరువాయి.

మనం చూసే వస్తువుమీదే (విషుకాణి) ఆధారపడి వుంటుందని విశ్వసిస్తారు. బంగారు ఆభరణాలు, తెల్ల బట్ట, బియ్యం, పసుపుపచ్చ దోసకాయ. తమలపాకులు, పువ్వులు, పళ్ళు, రామాయణ గ్రంథం, కొబ్బరి కాయను ఒక పళ్లెంలో పెట్టి... అద్దం, శ్రీకృష్ణుడి ఫొటో ముందర పెడతారు. వీటి పక్కన రెండు దీపపు కుందులు వెలిగించి పెడతారు. కుటుంబ పెద్ద ఈ వస్తువులను ముందుగా చూస్తారు. పిల్లల కళ్లకు గంతలు కట్టి జాగ్రత్తగా తీసుకెళ్లి 'విషుకాణి'ని చూపిస్తారు. వీటిని రాత్రి పూటే సిద్ధం చేసుకుని వుంచుతారు. తెల్లారి పండుగ రోజు లేవగానే ముందుగా దీనినే చూడడానికి ఏర్పాటు చేసుకుంటారు. వీరు సంప్రదాయ పాయసం, వెప్పంపూరసం (వేపతో చేసినది), మంపాపచ్చడి (మామిడి సూపు) చేసి ఆరగిస్తారు. ఎండు అరటి ఆకులు మొలకు చుట్టుకొని మొహానికి ముసుగు వేసుకుని చేసే సంప్రదాయ నృత్యాలు, కార్యక్రమాలు విచిత్రంగా వుంటాయి. ఈ వేషధారణతో ఇంటింటికి తిరుగుతూ చందాలు వసూలు చేస్తారు. ఆ డబ్బుతో 'విషు వేల' ఉత్సవం జరుపుకుంటారు.

'నవ వర్ష' బెంగాలీల ఉగాది

బెంగాలీలు 'నవ వర్ష'ను నూతన సంవత్సరాదిగా భావిస్తారు. బెంగాలీలు తొలి మాసంగా భావించే 'బైషక్' నెల తొలి రోజున ఈ పండుగ వస్తుంది. ఉదయాన్నే స్నానాదులు ముగించుకుని మగవాళ్లు సంప్రదాయ ధోతీ కుర్తా, మహిళలు ఎర్రంచు తెల్లచీర కట్టుకుంటారు. మల్లెపూలు పెట్టు కుంటారు. ఈ రోజును వారు పాటలు పాడుతూ, డాన్స్ చేస్తూ, ప్రాంతీయ ఆటలు ఆడుతూ... ఖుషీ ఖుషీగా జరుపుకుంటారు. గాలిపటాలు ఎగురవేస్తారు. ఎడ్ల పందాల్లో పాల్గొంటారు. నవ వర్ష కొత్త ప్రారంభానికి, నూతన ఆశయ సాధనకు, ఆనందోత్సాహాలకు, విజయాలకు సూచికగా కూడా భావిస్తారు. నూతన సంవత్సరాన్ని ఆహ్వానించడానికి వారు తమ ఇళ్లను శుభ్రంచేసి అలంకరిస్తారు. మహిళలు, బాలికలు ఇళ్ల ముంగిట వరిపిండితో ముచ్చటగొలిపే ముగ్గులు వేస్తారు. దీన్ని వారు 'అప్పన' అని పిలుస్తారు. ముగ్గు మధ్యలో మట్టికుండ నిండుగ నీళ్లు నింపి పెడతారు. కుండ మీద ఎరుపు, తెలుపు రంగులతో స్వస్తిక్ గుర్తు గీసి అలంకరిస్తారు. ఇది శుభసూచకమని, కుటుం బానికి ఏడాదంతా మంచి జరిగేలా చూస్తుందని విశ్వసిస్తారు. కొత్త వ్యాపారాలను ఈరోజునే ప్రారంభిస్తారు. వ్యాపారస్థులు కొత్త పద్దు పుస్తకాలు (హాల్‌ఖాతా) ప్రారంభిస్తారు. వీటి మీద పూజారులు స్వస్తిక్ గుర్తు రాస్తారు. తాము చేసే పనులకు ఎటువంటి విఘ్నాలు కలగకుండా వుంచేందుకు వినాయకుడిని పూజిస్తారు. అంతేకాదు పాత బకాయిలను సెటిల్ చేసుకుంటారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒకరికొకరు 'శుభో నవో వర్షో' అంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా వుండాలని ఈ రోజున మేఘపూజ చేస్తారు. ఆఖరికి కొండ ప్రాంతాలలో వుండే గిరిపుత్రులు కూడా ఈ పండుగను జరుపుకుంటారు. తమాషా ఏంటంటే... బెంగాలీలు సంవత్సరం చివరి మాసం ఆఖరి రోజు అయిన 'చైత్ర-సంక్రాంతి'ని కూడా అంతే ఉత్సాహపూరితంగా జరుపు కుంటారు.

'లోసూంగ్' సిక్కింవాసుల ఉగాది

కోతల సీజన్ పూర్తయ్యే తరుణంలో డిసెంబర్‌లో నూతన సంవత్సరాది 'లోసూంగ్' పండుగను జరుపు కుంటారు. ఇదే సిక్కిం రాష్ట్ర ప్రజల నూతన సంవ త్సర పండుగ. చామ్ నృత్యాలు, విల్లంబుల పోటీలు ఈ పండుగకే ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఆరోజున సంప్ర దాయ చామ్ నృత్యం లేదా లామా నృత్యం చేస్తారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి చిహ్నంగా ఈ డాన్స్ చేస్తారు. ఈ పండుగను సోనమ్ లోసూంగ్‌గా (రైతుల కొత్త సంవత్సరం) కూడా భావిస్తారు. టిబెటన్ క్యాలండర్ ప్రకారం పదవ మాసం 18వ రోజున ఈ పండుగను జరుపుకుంటారు. అప్పటికి వడ్లు, ఇతర ధాన్యాలు ఇళ్లకు వచ్చి వుంటాయి. దాంతో ప్రజలు ఆరోజును ఎంతో సంతోషంగా గడుపుతారు. చామ్ నృత్యం చేస్తారు. సూర్యోదయానికి ముందే లేచి స్నానా దులు పూర్తిచేసి కొత్త బట్టలు వేసుకుంటారు. శాంతిసౌభాగ్యాలను కోరుకుంటూ కుటుంబ సభ్యులంతా పూజలు చేస్తారు. ఈ పండుగ ఉత్సవాలను పదిహేను రోజులపాటు జరుపు కుంటారు. విల్లంబుల పోటీలు కూడా నిర్వహిస్తారు.

'బెస్తు వారస్' గుజరాతీల ఉగాది

గుజరాత్ ప్రజలు అక్టోబర్‌లో జరుపుకునే అన్ని ప్రధాన పండు గలలోకి కొత్త సంవత్సర వేడుక ప్రముఖమైనది. గుజరాతీ క్యాలండర్ ప్రకారం తొలి మాసమైన కార్తీక మాసం తొలి రోజున నూతన సంవత్సరాది 'బెస్తువారస్'ను జరుపుకుంటారు. దీనినే 'వర్ష ప్రతిపాద' అని కూడా అంటారు. శ్రీ కృష్ణుడు ప్రజలను భారీ వర్షాల నుంచి కాపాడడానికి గోవర్ధన పూజ చేశాడని పురాణాల్లో వుంది. అప్పటి నుంచి గుజరాతీలు ఆరోజునే ఉగాది పండుగ జరుపుకుంటారు. గోవర్ధన పర్వతాన్ని పూజిస్తారు. సంప్రదాయ పద్ధతుల్లో పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. గడిచిన సంవత్సరంలో ఎదురైన కష్టనష్టాలను ఆ రోజుతో మర్చిపోతారు. కొత్త ఆశలను, కోర్కెలను మనసులో నింపుకొని కొత్త సంవత్సరంలోకి అడుగెడతారు. ఈ పండుగ దీపావళి పండుగ వాతావరణాన్ని తల పిస్తుంది. ఇళ్లను రంగురంగుల పూలతో అలంకరిస్తారు. దీపాలు వెలిగిస్తారు. పూలు, మిఠాయిలు తీసుకొని ఆలయాలను దర్శించుకుంటారు. రకరకాల పిండి వంటలతో కూడిన భోజనం చేస్తారు.

'దీపావళే' మార్వాడీల ఉగాది

రాజస్థాన్‌లోని మార్వాడీలు కొత్త సంవత్సర వేడుకను దీపావళి రోజునే జరుపుకుంటారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించడానికి దీపావళే శుభప్రదమైన రోజని భావిస్తారు. అందుకే ఆ రోజే కొత్త సంవత్సరాదిని జరుపుకుంటారు. ఇది సాధారణంగా అక్టోబర్-నవంబర్ మాసాల్లో వస్తుంది. ఈ పండుగ ఉత్సవాల్లో ఆనందోత్సాహాలతో పాలుపంచు కుంటారు. దీపావళి పండుగ ఏర్పాట్లు, నెల రోజుల ముందుగానే మొదలవుతాయి. పండుగకు వారం ముందు మహిళలంతా 'అహోయ్ అష్టమి' పండుగ జరుపుకుంటారు. భర్తలు ఆయు రారోగ్యాలతో పూర్ణాయుష్కులుగా జీవిం చాలని ఈరోజున వారు ప్రార్థిస్తూ ఉపవాసాలుంటారు. అద్దాలతో చేసిన తోరణాలను ఇంటి గుమ్మాలకు అలంక రిస్తారు. బనియ-మార్వాడీలు ఈరోజున చేసే హంగామా అంతా ఇంతా కాదు. గోడమీద 'అహోయ్ మాత' బొమ్మను వేస్తారు. అక్కడే దీపావళి పూజలు నిర్వహిస్తారు. సంపదలను ప్రసాదించమని లక్ష్మీదేవిని, విఘ్నాలు కలుగకుండా చూడమని వినాయకుణ్ణి పూజిస్తారు. పెరుగు, పచ్చి పాలు, తులసి ఆకులు, పంచదార కలిపి చేసిన 'చర్నామృతం' పూజ అనంతరం అందరికీ పంచిపెడతారు. శుభాలు కలుగుతాయని వెండి నాణాన్ని కొనుగోలు చేస్తారు. పూజ అనంతరం వ్యాపారస్తులంతా కొత్త పద్దు పుస్తకాలను ప్రారంభిస్తారు. కొత్త సంవత్సరంనాడు ఒక తమలపాకును కొత్త పద్దు పుస్తకంలో వుంచితే మంచి జరుగుతుందని విశ్వసి స్తారు. నేతి వంటకాలతో సాయంత్రం భోజనాలు చేస్తారు. పూలిన్‌పోలి (తీపి పూరి), హల్వా, సేమ్యా పాయసం, జిలేబీ తప్పనిసరిగా వుంటాయి.

'పుతందు' తమిళుల ఉగాది

తమిళులు ఏప్రిల్ 13 లేదా 14 వ తేదీన నూతన సవత్సరాది 'పుతందు'ను జరుపు కుంటారు. ఒకరికొకరు 'పుతందు వఙ్‌తుకల్' అంటూ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపు కుంటారు. ఈరోజును 'వరుష పిరప్పువ్'గా కూడా భావిస్తారు. బ్రహ్మ విశ్వ సృష్టిని ఈ రోజే ప్రారంభిం చాడని వారు విశ్వ శిస్తారు. 'పుతందు'ను ఎంతో సంబవరంగా జరుపు కుంటారు. ముఖ్యంగా ఆరోజు రుచికరమైన పదార్థాలను తయారు చేస్తారు. వీరు కూడా తెలుగు వారిలాగే పచ్చిమామిడి ముక్కలు, బెల్లం, వేపపూత, ఉప్పు కలిపి 'మాంగ పచ్చడి' చేస్తారు. జీవితంలో గెలుపు ఓటములు... సుఖదుఃఖాలు వుంటాయనడానికి నిదర్శనంగా ఈ పచ్చడిని భావిస్తారు. కుంభకోణంకు సమీ పానున్న తిరువదమరుదూర్‌లో రథోత్సవం జరుపుతారు.

వీరు ఆ ఉదయం లేవడం తోటే బంగారం, వెండి అభరణాలు, తమలపాకులు, పళ్లు, కూరగాయలు, పూలు, బియ్యం, కొబ్బరికాయలు చూస్తే శుభ సూచికమని భావిస్తారు. ఉదయాన్నే లేచి స్నానం చేసి గుళ్లకు వెళ్లి జీవితంలో విజయం సాధించేలా దీవించమని ప్రార్థిస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం వుంటుంది. ఎక్కువమంది కొత్త జీవితానికి ప్రతీకగా తమ ఇళ్లకు రంగులు వేసుకుంటారు. మహిళలు గుమ్మా లకు మామిడాకుల తోరణాలు కట్టి, ఇంటి ముందు ముగ్గులు (కోలమ్) వేస్తారు. అందంగా అలంకరించిన దీపాన్ని ముగ్గు మధ్యలో వుంచుతారు. బహుమతులు, తీపి వస్తువులు ఇచ్చిపుచ్చుకుంటారు. చిన్నా రులకు ఈ 'పుతందు' పండుగ అంటే చాలా ఇష్టం. ఎందుకంటే ఆరోజు వారికి తల్లిదండ్రులు, బంధువులు, పెద్దలు వారికి చిన్ని చిన్న బహుమతులు లేదా డబ్బు ఇస్తారు.

రకరకాల పేర్లతో వేర్వేరు మాసాల్లో జరుపుకునే సంవత్సరాది విశేషాలను చదువుతుంటే 'భిన్నత్వంలో ఏకత్వం' అంటే ఇదే అనిపిస్తోంది కదా!.

❋

'లోసూంగ్' సందర్భంగా...


విషుకాణి




విషుకాణి

కథ

రుణం

బింగి సత్యనారాయణ

ఆ వెలుగులో మరీ స్పష్టంగా కాకపోయినా బాగానే కనపడుతోంది. రాజేష్ ఈసారి కాస్త పరిశీలనగా ఆవిడ వంక చూశాడు. ఎందుకనో మళ్లీ మళ్లీ తీక్షణంగా చూశాడు. తనకు సుపరిచితురాలిలా తోచింది. తన అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకు పక్కనున్నావిడతో చనిపోయినామె పేరు వాకబు చేశాడు. 'నిర్మల'ని చెప్పింది. ఒక్కసారి నిశ్చేష్టుడైపోయాడు. మెదడులోని నరాలు చిట్లిపోతున్నటువంటి భావన... తల భూవేగం కంటే పదిరెట్లు ఎక్కువగా తిరుగుతున్నట్టు ఫీలింగ్.... "ని...ర్మ...ల" అప్రయత్నంగానే పొడిపొడిగా అనేశాడు రాజేష్. ఇన్ని రోజుల తర్వాత కాదు కాదు... ఇన్నేళ్ల తరువాత కలుస్తాననుకోలేదు. అందులో ఇలా...ఈ దుర్భరస్థితిలో... అనాథ శవంగా...

రాజేష్, రజని దంపతులు. వారి ముఖాల్లో నిరాశ, నిస్పృహ కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. జీవంలేని చూపులో ఏదో కోల్పోయిన భావన. వచ్చి సిమెంట్ దిమ్మెలాంటి దానిపైన భిన్న ధృవాల్లా కూర్చున్నారు. రజని తన చేతిలోని మెడికల్ టెస్ట్‌కు సంబంధించిన ఫైల్‌ని పక్కన పెట్టి శూన్యంలోకి చూడసాగింది. ఆమెకళ్ళు నింగిలోని మబ్బుల్లా వర్షించేందుకు సిద్ధంగా వున్నాయి. శూన్యంలా తోస్తున్న జీవితం. ఇక తాను అనుకున్న ఆనందం ... ఆశ... నెరవేరదని పూర్తిగా నేటితో తేలిపోయింది. ఎంతోఖర్చుతో కూడుకున్నదైనా మూడవసారి టెస్ట్ చేయించారు. నెగిటివ్ రిజల్టు రావడంతో వారి గుండెలు జారాయి. ఆ విషయం తలచుకోగానే రజనికి ఏడుపు ఆగలేదు. రాజేష్ మెల్లిగా వెనుదిరిగాడు. ఆమె భుజాల్ని పొదవి పట్టుకొని వద్దన్నట్టుగా కళ్లతోనే సైగ చేశాడు. భర్త ముఖాన్ని సూటిగా చూడలేక చూపుల్ని పక్కకు మరల్చుకుంది. కన్నీటి బొట్లు జలజలారాలాయి. తన శోకానికి కారణం...! అమ్మ! ఆ రెండక్షరాల పిలుపు ఎప్పటికీ వినలేనన్న పచ్చినిజం. తన ప్రతి రూపం బుడి బుడి నడకలతో.. తప్పటడుగులతో.. పడిలేస్తూ వస్తూ వుంటే చూడాలని తాపత్రయం... పసిపాపకు తన్మయత్వంతో పాలిస్తూ పరవశించిపోవాలని ఆరాటం. ఆ కోరిక కోరికలాగానే ఉండిపోయింది. ఏ అనాథ శిశువు తమ ఒడి పంచితే... వాడు 'మన' కాదు... మన 'రక్తమూ' కాదు అనే భావన మళ్లీ ఇద్దరిదీనూ.

❖ ❖ ❖

వీరి మౌనాన్ని ఛేదిస్తూ ఎదురుగా ఏదో కలకలం. కాసింత దూరంలో వున్న గుడిసెలోకి చుట్టుపక్కలనున్న జనం పరిగెత్తుకు రాసాగారు. కాసేపటికి రోదనలు. రాజేష్, రజని ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అక్కడి విషయం ఏంటో తెలుసుకోవాలన్న సహజ సిద్ధమైన ఆసక్తి మొదలైంది. ఎలాగూ తాము ఎక్కాల్సిన బస్ రాకపోవడంతో, ఇద్దరూ అటుగా అడుగు లేశారు. అక్కడ ఒకతను వాకిలికెదురుగా కట్టెలతో నిప్పు రాజేసేపనిలో పడ్డాడు. అది చూసిన వీరు ఎవరో ఒకరు పోయారనుకున్న నిర్ణయాని కొచ్చారు. ఆ గుడిసెలోంచి బైటికి వస్తున్న ఆడవాళ్లు కొంగుతో కళ్లొత్తుకుంటున్నారు.

ఇంతలో సన్నగా వర్షం మొదలైంది. సహృద్భావనతో చూద్దామనుకుని, చిన్నగా ఉన్న గుమ్మానికి తలను వంచి లోనికెళ్ళారు. గుడిసె లోపల కాస్త చీకటిగా ఉంది. దాని వైశాల్యం పది మంది కూర్చునేటట్టులేదు. ఇంతలో ఇద్దరు మగవాళ్ళు బయటనుండి తీసుకొచ్చిన గడ్డిని నేలమీద పరిచి, దానిపై శవాన్ని పడుకోబెట్టి వెళ్లారు. తల దగ్గర పెట్టిన దీపం కాసేపటికే కొడిగట్టసాగింది. చమురులేని ఆ దీపం ఆమె జీవనానికి ప్రతీకగా ఉంది. పక్కనే కూర్చుని సుమారు రెండేళ్ల పాప భోరున ఏడుస్తోంది. ఒంటిమీద ఏమీ లేదు. చలనం లేని తల్లిపై పడి కదిలిస్తూ, ఏడుస్తున్న పాపను చూసి చుట్టూ ఉన్నవారు కనీళ్ల పర్యంతం అయ్యారు. రజని కూడా. కరిగి కన్నీరవుతున్న పాప ప్రతి చుక్కా శాశ్వత నిద్రలో ఉన్న తల్లికి తర్పణమౌతోంది. అక్కడ ఉన్న పరిస్థితులను చూసి రాజేష్ హృదయం చలించిపోయింది. తనకు తెలియకుండానే కంటిలో నీరు చేరింది. వర్షం జోరుగా పూపందుకుంది. వర్షం నీరు శవం దగ్గరకు రావడంతో, వాకిలికి అడ్డంగా సిమెంట్ బస్తాల సంచులు కట్టే ప్రయత్నంలో పడ్డారు కొందరు. ఉన్న దీపపు కాంతిలో చనిపోయిన స్త్రీ యొక్క ముఖం అస్పష్టంగా కన్పించింది రాజేష్‌కి. కానీ బక్కచిక్కిపోయిన మనిషిలా, చాలాకాలంగా అస్వస్థతతో ఉన్నట్టు మాత్రం చూచాయగా తెలుస్తోంది. ఇంతలో ఒకతను బయట నుండి గ్యాస్‌లైట్ ఏర్పాటుతో లోనికొచ్చాడు. తీసుకొచ్చి ఆ స్త్రీ మూర్తి పక్కన పెట్టారు. ఆ వెలుగులో మరీ స్పష్టంగా కాకపోయినా బాగానే కనపడుతోంది. రాజేష్ ఈసారి కాస్త పరిశీలనగా ఆవిడ వంక చూశాడు. ఎందుకనో మళ్లీ మళ్లీ తీక్షణంగా చూశాడు. తనకు సుపరిచితురాలిలా తోస్తోంది. తన అనుమానాన్ని నివృత్తి చేసుకునందుకు పక్కనున్నావిడతో చనిపోయినామె పేరు వాకబు చేశాడు. 'నిర్మల'ని చెప్పింది. ఒక్కసారి నిశ్చేష్టుడైపోయాడు. మెదడులోని నరాలు చిట్లిపోతున్నటువంటి భావన... తల భూవేగం కంటే పదిరెట్లు ఎక్కువగా తిరుగుతున్నట్టు ఫీలింగ్.... "ని...ర్మ....ల" అప్రయత్నంగానే పొడిపొడిగా అనేశాడు రాజేష్. ఇన్ని రోజుల తర్వాత కాదు కాదు... ఇన్నేళ్ల తరువాత కలుస్తాననుకోలేదు. అందులో ఇలా...ఈ దుర్భరస్థితిలో... అనాథ శవంగా... అక్కడ ఎందుకనో నిలబడబుద్ధి కాక మెల్లిగా బయటికి నడిచాడు. పక్కనున్న రాయిలాంటి దానిమీద కూలబడ్డాడు. సన్నగా వర్షం కురుస్తూనే ఉంది. ఐనా తనకి ఏమీ పట్టనట్టుగా అలాగే అక్కడే కూర్చున్నాడు. నింగికి నేలకు నిచ్చెనవేస్తున్న వాన. భర్త కనిపించకపోయేసరికి బైటకి వచ్చింది రజని. రాజేష్ వర్షంలో తడవడం చూసి గుర్తు చేసింది. తన ప్రమేయం లేకుండానే లేచి పందిరిలాంటి గుంజకు వొరిగి నిల్చున్నాడు. ఇందాక రాజేసిన కట్టెలు వానకు చల్లారి పొగలు చిమ్ముతున్నాయి. రాజేష్ మనో తెరపై గత ఎనిమిదేళ్లుగా నిర్మల జ్ఞాపకాలపై కమ్ముకున్న మబ్బులు మెల్లి మెల్లిగా వీడుతూ స్పష్టంగా కనపడుతున్నాయి....

❖ ❖ ❖

రాజేష్ రాజధాని నగరానికి గుంపులో గోవిందయ్యలా ఉద్యోగవేటకి అస్త్రశస్త్రాలతో సంసిద్ధుడయ్యాడు. అక్కడకు వెళ్లాల్సిన అవసరం ఉంది. - నైతిక బాధ్యత ఉంది. తనకు ముగ్గురు చెల్లెళ్లు.

ఆయనకు తాతనుండి ఏ ఆస్తి సంక్రమించలేదన్న బాధ, ఏకోశాన

లేదు..... సంతోషమే ఎక్కువ ఎందుకంటే వారి నుండి తన తండ్రికి అబ్బింది ఒకే ఒక ఆస్తి, 'ఆస్తమా', అది మాత్రం తమ నలుగురిలో ఏ ఒక్కరికి దక్కక పోవడం పూర్వజన్మ సుకృతమూ- పదివేలు. లేకపోతే ఆయనలా ప్రతినెలా మెడికల్ బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ఇక సిటీకి ఫ్రెండ్స్ వాళ్ల అడ్రస్‌లు తీసుకొని కైలాసానికేగుతున్న భగీరథుడిలా దీక్షతో, పట్టుదలతో, కృత నిశ్చయుడై బయలుదేరాడు. అప్పగింతల్లోని పెళ్ళికూతురికి చెప్పాల్సిన మంచి మాటల్లా రేపోమాపో సిటీకి అంకితమవుతున్న తనకు బాగోగులు చెప్పారు. గుమ్మం దాటుతున్న తనకు, తల్లిదండ్రులు... చెల్లెళ్ల కళ్లలో కనిపించింది.... ఓ ఆశ... ఓ నమ్మకం... ప్రస్ఫుటంగా కనిపించాయి. పచ్చళ్ల బాటిల్స్‌తో బాటు, బరువు బాధ్యతల్నీ మూటగట్టారు.

వచ్చిన నెల రోజుల్లో చదివిన చదువులకే హోదానిచ్చే జాబ్ రాకపోయినా పరిస్థితుల దృష్ట్యా, ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా చేరక తప్పలేదు. మరో ముగ్గురితో కలిసి ఒక రూం అద్దెకు తీసుకొని ఉన్నాడు. కాలగమనంలో రోజులు గడుస్తున్నాయి. కానీ ప్రతినిత్యం, చెల్లెళ్ల బరువులు బాధ్యతలు గుర్తుకొచ్చేవి.

"ఒరేయ్ రాజేష్! మేము అలా బయటికెళ్లొస్తాం వచ్చేసరికి కాస్త లేటవ్వచ్చు. గడియ తీసే ఉంచు!!" అంటూ రూమ్‌మేట్స్ ముగ్గురు బయటికెళ్లారు. వాళ్లకది మామూలే! అందులోనూ సాయంత్రాలైతే మరీనూ, ఆఫీస్ నుండి రావటం.... రాగానే ఫ్రెష్‌గా రెడీ అవటం... ఇస్త్రీ బట్టలు వేసుకోవటం.. కాస్ట్‌లీ పర్‌ఫ్యూమ్స్ వంటి నిండా స్ప్రే చేసుకోవడం... ఏ రాత్రివేళో రావటం... వారిలా 'షోకిల్లా'గా మారటం తనకు ఇష్టమే కాని మెస్ ఖర్చులకు, హౌజ్‌రెంట్‌కు పోనూ ఏ మాత్రం మిగలదు. అమిగిలిందైనా ఇంటికి ఎం.ఓ చేయాలి. రాజేష్‌ది వారిలా జేబుల నిండా శాలరీ కాదు. ఎంజాయ్ చేయటానికి.

ఆ సాయంత్రం కూడా రూమ్‌మేట్స్ అంతా ఫ్రెష్‌గా తయారయి రోడ్డు మీదికెళ్లారు. రూంలో ఒంటరిగా ఉన్న రాజేష్‌లో ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టాయి. ఇన్నాళ్ళు వారితో ఉన్నా తామరాకుపై నీటి బిందువులా ఉన్నాడు. కారణం- పరిస్థితులు. కానీ ఈ మధ్య తన వేతనం రెండు వేలు పెరిగింది. బుసకొట్టే వయసు పోరుకు ఇంటి దగ్గర సమస్యలతో స్ఫురణతో చల్లార్చుకున్నందుకు 'ఆ' ఆనందం ఏంటో తెలుసుకోవాలన్న ఉత్సుకత మొదలైంది ఆ క్షణంలో.

❖ ❖ ❖

నెక్లెస్ రోడ్డు. వెన్నెల వర్షంలా కురుస్తోంది. నిర్మలంగా ఉన్న ఆకాశంలో వెన్నెల వెండి తీగలతో చంద్రుడు భూమినీ ఆకాశాన్నీ కలుపుతున్నాడు. ఓ దగ్గర పచ్చని గడ్డిపై కూర్చున్నాడు రాజేష్. చల్లటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఈ మధ్య కురిసిన వర్షాలతో సాగరం నిండుగా ఉంది. రోడ్డుమీద ఝుమ్మంటూ సాగుతున్న వాహనాలు మిణుగురుల్లా తోస్తున్నాయి. చుట్టు పక్కల ఎన్నో జంటలు.. కొన్ని కొంటె జంటలు...చిలిపి క్రియలు... పొదలు.... పెద్ద పెద్ద రాళ్ళు తమ ఒడినిస్తున్నాయి. కాలం కౌగిలిలో మరో రెండు గంటలు బందీ అయ్యాయి. జనం పల్చబడ్డారు. రాజేష్ అక్కడ నుండి లేచి తను వచ్చిన పనిలో పడ్డాడు. తను పనిగట్టుకొని వచ్చిన ఊహే! మనసును గిలిగింతలు పెడుతోంది. ఇంతకాలం నిగ్రహం-కోరికతో పోటీపడీపడీ నిగ్రహంతో ఓడిపోయాడు. వచ్చిన పనిని ఎలా డీల్ చేయాలో తెలియటంలేదు. అటూ ఇటూ నడిచి విసిగివేసారి పేవ్‌మెంట్‌పై కూలబడ్డాడు. అనుకోకుండా రోడ్డు ఆవలివైపు చూశాడు. ఓ అమ్మాయి నిలబడి ఉంది. వెళ్ళి అడిగితే! కొంపదీసి ఆ టైప్ కాకపోతే చెప్పు తెగుద్దనుకుని ఆమెనే చూస్తూ ఉండిపోయాడు. రాజేష్ మనుసులో ఉబలాటం. ఆరాటం క్షణక్షణానికి ఎక్కువవుతున్నాయి. ఎవరి కోసమో ఎదురు చూస్తున్న అభిసారికలా ఉందాస్త్రీ. "ఒకవేళ.... నేననుకుంటున్న... వెళ్ళి చూస్తే సరి!" మనసులో అనుకొని కాసింత ధైర్యాన్ని కూడగట్టుకొని అటుగా వెళ్ళాడు. దగ్గరగా వెళ్ళి పరిశీలిస్తే తెలుగుతనం వంటినిండా పట్టించుకున్న పడతిలా ఉందామె! పొడవాటి జడ... తురుముకున్న మల్లెదండ గుబాళింపు.. మన్మథుణ్ణి చేస్తున్నాయి. విచక్షణా రహితంగా.. రాజేష్ బిక్కు బిక్కుమంటూ ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె బెరుకు బెరుకుగానే చూపుల్ని పక్కకు మరల్చింది. ముగ్ధమనోహరంగా ఉన్న ఆమెతో,

"మీ.....రు...!" అన్నాడు... తనకే వినబడ్లేదు. అర్థమైనదానిలా నేల చూపులు చూస్తు తల నిలువునా ఆడించింది.

"మీరు ఏమి అనుకోనంటే అలా వెళ్తూ మాట్లాడుకుందాం"అన్నాడు. ఇద్దరూ కలిసి నడకసాగించారు.

"మీపేరు...?"

"నిర్మల" అంది. గాలికి రేగుతున్న ముంగురులను సవరించుకుంటూ.

"మీలాగే నిర్మలంగా ఉంది" ముసి ముసిగా నవ్వింది తను. ఆ నవ్వులకు విరిసిన పలువరస మరో నక్లెస్ రోడ్డుని తలపించింది.

"మీరు ఏమి ఫీలవ్వనంటే... ఒక మాటడుగుతాను.."

"అడగండి!" అంది కొంగునిండుగా కప్పుకొంటూ.

"మీరు ఈ వృత్తిని ఎందుకు ఎంచుకున్నారు?" మాట పూర్తవ్వ కుండానే నిర్మల మొహంలో రంగులు మారాయి. అప్పటిదాకా నవ్వుతున్న మొహం వెలవెలబోయి విషాదం అలముకొంది. సమాధానం కోసం ఆమె కళ్లల్లోకి తొంగి చూశాడు రాజేష్. నిర్మల కళ్లు సజల నేత్రాలయ్యాయి.

"నేను మీరనుకున్నట్టు రాటుదేలినదాన్ని కాను. ఇంట్లో పరిస్థితులకు తలొగ్గి. ఇందులోకి దిగాలనుకున్నాను. అదీ కూడా ఈ రోజే..." అంది ఏడుస్తూ.

"ఇంట్లో పరిస్థితులకు ఈ వృత్తే ఎంచుకోవాలా?"

"రోగిష్టి తల్లి. గుండె జబ్బు. రోజుకు వంద రెండొందలు మందులకు కావాలి. అన్నీ డబ్బులు కావాలంటే నేనో పెద్ద ఉద్యోగం చేయాలి. చేయాలంటే పెద్ద చదువు వుండాలి. నాకా చదువులేదు. ఐనా శాయశక్తులా పని చేయటానికి ప్రయత్నించాను. ఎక్కడ పని చేసినా దిక్కులేనిదాన్నని తెలిసి పదిహేను నుంచి అరవైదాకో ఇస్తామనేవారు. పైగా అదోరకంగా చూసేవారే! అదోరకంగా మాట్లాడేవారే!" అని చెప్పుకుంటూ పోతోంది. ఇక ఇదేదో సిన్మాకథలా అనిపించినా ఇక ఆ సంభాషణ ముందుకు సాగించటం ఇష్టమనిపించలేదు రాజేష్‌కి.

ఆమెది అవసరం-తనది అవకాశం అనుకున్నాడు. ఊరిలోని పైరగాలిలా స్వచ్ఛమైన పల్లె మనసు తనది. ఈవిడ సిటీలోని కాలుష్యంలా కలుషితం కాలేదు కదా! అనుకున్నాడు. ఐనా సరే! తాను స్వాంతన చెందేందుకు ఒక ఆడదాని ఒడి కావాలి-వెచ్చని స్పర్శ కావాలి. అదీ భార్య నుంచి పొందవచ్చు. లేక మరొకరినుంచైనా పొందవచ్చు. తానున్న పరిస్థితుల్లో రెండవదే సాధ్యం. ఇప్పట్లో మొదటిది సాధ్యంకాదు. స్పీడ్‌బ్రేకర్స్ లాంటి చెల్లెళ్లున్నారు. వాటిని దాటుకుంటూ వెళ్లాలంటే ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదు. రాజేష్ బుర్రలో చటుక్కున ఓ ఆలోచన మెరిసింది.

"నిర్మలా...!' ఈ సారి ఏకవచనంతో సంబోధించాడు. ఏమిటన్నట్టుగా చూసింది.

"ఏమి లేదు! నువ్వు నాకు భార్యకాని భార్యలా ఉండాలి. అలా ఉంటే నీ కుటుంబాన్ని పోషించే బాధ్యత నాది." అన్నాడు త్వరలో తన ప్రమోషన్‌ను దృష్టిలో పెట్టుకొని. నిర్మల కాసేపాలోచించి. "సరే" అంది. త్వరలో తాను అనుకున్నది సాధించబోతున్నానన్న సంతోషం. "ఇంకో విషయం. పెళ్లి, గిల్లీ అనే మాటలు మన మధ్య ఎన్నడూ రాకూడదు" అంటూ ఒట్టు వేయమన్నట్లు చెయ్యి చాపాడు. నిర్మల చెయ్యి కలిపింది. జీవితంలో మొదటి సారిగా పర స్త్రీ చేతి స్పర్శ... మనసులో అప్పటిదాకా నిద్రాణమై ఉన్న కోరిక తేలు కొండిలా పడునెక్కింది. వలపు తలుపు తడితే నిగ్రహించుకొనే శక్తి ఎవ్వరివల్ల కాదు. రాజేష్ చూపులు ఎక్కడెక్కడో ప్రసరిస్తున్నాయి. ఆక్షణం నుండి నుండి రాజేష్ ఆనందానుభూతుల మధనానికి కదలి తను... దినచర్యల్లోని మానసిక ఒత్తిడికి... ఓదార్పు... ఉపశమనం... నిర్మల కమ్మని ఒడి... అతని దృష్టిలో ఏనాడూ వెలయాలిగా అన్పించలేదు. నిర్మల విషయం. తనకు తప్ప ఏ ఒక్కరికి తెలియదు. తెలియకుండా జాగ్రత్త పడ్డాడుకూడా.

❖ ❖ ❖

ఆలోచనల్లోంచి తేరుకున్నాడు రాజేష్. తన బాధ్యత నిర్వర్తించే వరకు ఆమెతో పరిచయం కొనసాగింది. తనకు పెళ్లి సంబంధాలు మొదలు పెట్టగానే నిర్మలతో మెల్లి మెల్లిగా కావాలనే దూరమయ్యాడు. ఆ తర్వాత ఆమెతో తెగతెంపులు జరిగి మళ్లీ ఈనాడిలా, ఇలాంటి దీనస్థితిలో చూస్తాడనుకోలేదు. తన పని గట్టెక్కించుకున్నంత వరకు వాడుకున్నాడు. కనీసం ఉపాధి కల్పించే ప్రయత్నమూ చేయలేదు. స్వార్ధజీవికి ప్రతీకగా నిలిచిపోయాడు రాజేష్. అంతరాత్మ అప్పుడేమోగానీ ఇప్పుడు ప్రశ్నిస్తోంది. నువ్వు తప్పు చేశావంటూ. కసిమీదున్న ప్రాయం మంచి చెడులు చూడదన్నది వాస్తవం. ఆ తాపం చల్లారిన తరువాతే విచక్షణ- వివేచన. "కేవలం ఆ స్త్రీ మూర్తిని నీ అవసరాలకనుగుణంగా వాడుకొని విసిరేశావే! సాటి మనిషిగా ఇంత చేయూత నిద్దామన్న ఆలోచన రానందుకు సిగ్గుపడ్డాడు. కొన్నాళ్ల సహచర్యంలో ఆలి కాని ఆలి అయ్యింది. ఆమె అవసరాన్ని అవకాశంగా తీసుకొని నువ్వు బాగుపడ్డావు. మరి నిర్మల!?. నీది డబ్బు.... ఆమెది శీలం. నీ అవసరం తీరంగానే వెలయాలిని చేశావు.!.. చేశావు...!!" అని అంతరాత్మ ఘోషించింది. దాంతో పశ్చాత్తాప ధోరణిలో పడ్డాడు రాజేష్. తన చెల్లెళ్ల బాధ్యతలకు పరోక్షంగా చేయూతనందించింది. ఆవిడకు ఏదో విధంగా రుణపడిపోయాడు. ఎలా తీర్చుకోగలను?" అనుకున్నాడు.

ఎందుకనో మరోసారి నిర్మలను చూడాలనిపించి లోనికెళ్లాడు. నిస్తేజంగా, నిస్ప్రాణంగా పడుకొని ఉన్న నిర్మలను చూసి రాజేష్ కళ్లు చెమర్చాయి. తల్లిని తడుముతూ ఆలాగే ఏడుస్తోంది ఆ పసిపాప. గబగబా వెళ్లి ఆపాప నెత్తుకున్నాడు రాజేష్. నిర్మల వంక చూస్తూ నీ రుణం ఇలా తీర్చుకుంటానని ధీమాగా మనసులో వ్యక్తం చేశాడు.

❋

డా॥ జె.పి.వైద్య



బిత్తర చూపుల 'పోపట్ లాల్'!

'జబ్ ప్యార్ కిసీసే హోతాహై'లో రాజేంద్రనాథ్ నటించిన 'పోపట్ లాల్' పాత్ర ఆద్యంతమూ అద్భుతమైన అవిస్మరణీయమైన నటనా పాటవం ఉన్న పాత్ర అని కాదు.
కాస్తంత తలా తోకా లేని వూకదంపుడు కామెడీ రోలే!
పెద్ద పెద్ద లావాటి కళ్ళద్దాలూ..... దుబ్బుగా పెరిగిన కను బొమ్మలూ... లావాటి వంకర తిరిగిన పెదవులు అస్తమానం ఏదో గొణుగుతూ ఉంటాయి. అవతారం అంతే హాస్యాస్పదంగా ఉండేది. పెద్ద పెద్ద గళ్లకోటూ.... కింద మోకాలు దాకా వూగే నాడా...లూజ్గా, విశాలంగా ఉంటే చడ్డీ లాంటి నిక్కరూ... తడబడే బూట్ల అడుగులూ... మొహమ్మీద జాలి కల్పించేలా వెధవ చూపు... కాని, మెదడులో యమ (బోడి) ప్లానింగ్లూ....! అదీ 'పోపట్లాల్' పాత్ర.

'నవ్వు నాలుగు విధాల చేటు' అని పెద్దోళ్ళు గంభీరంగా చెప్పి వెళ్ళిపోయారు. మనం రకరకాల సూక్తులను తలచుకొని నవ్వుకున్నాము. హాస్యం కొందరికి పడదు. అన్ని వేళల్లో పండదు కూడా.

ఒక విరుపు, ఒక మెలిక, ఒక వక్రోక్తి, ఒక హాస్యపు పలుకు సహృదయుడి హృదయాన్ని చలింప చేస్తుంది.

హాస్యం ఒక అందమైన రస గుళిక. భోజనంలో ఉప్పు తప్పినట్లు ఉంటుంది. హాస్యమూ - నవ్వులూ లేని సమావేశాలు... సంభాషణలూ.... ముచ్చట్లూ...!

హాస్యం కళ్ళెం లేని గుర్రం లాంటిది. కొన్ని సమయాల్లో స్నేహితుడినీ, మరికొన్ని సమయాల్లో దాని యజమానిని సైతం 'ఠాప్' మని తన్నగల ప్రమాదకారి అది. హాస్యం లేని జీవితం... నవ్వులు లేని కొంప... నవ్వలేని 'మహానుభావులు'... నిర్ద్వందంగా 'వింతలూ-విడ్డూరాలే'.... వింత మనష్యులే!

మన జీవితాల్లో మూడు పువ్వులు-ఆరు కాయలున్నాయో లేదో కాని అలనాటి నాటక రంగంలో, సినీ మాయానగరిలో, వెండితెర మీదా హాస్యం అక్షరాలా మూడొందల పువ్వులై... ఆరొందల కాయలై 'దోర'గా పండింది. అప్పుడప్పుడు 'అతి'గాను సాగింది. కొన్ని సార్లు జుగుప్సాకరంగానూ, మరికొన్ని సార్లు వెగటు గానూ, ఇంకొన్ని సార్లు 'థూ...! థూ...! చంపుకొని తిన్నార్రా తమ్మీ! దండి ఘోరం... సీన్లన్నీ కంపు పట్టిచ్చిన్రు....' అన్నంత దరిద్రంగానూ, చీదరించుకునేలా చేసింది.

హాస్యం స్టేజీమీదైనా, తెరమీదైనా పండించాలంటే అతి ముఖ్యమైనది 'టైమింగ్'. దొంగలు పడ్డ ఆర్నెల్లకు పోలీసులొచ్చినట్టు 'లేట్ లతీఫ్ రెస్పాన్స్'తోనూ హాస్యాన్ని అద్భుతంగా పండించిన వాళ్లున్నారు.

హాస్య నటీనటులకు అటు 'బాలివుడ్'లోనూ.. ఇటు 'టాలివుడ్'లోనూ ఏ నాడూ కరువులేదు.

'చల్తీకీ నామ్ గాడీ' లో 'గాంగులీ బ్రదర్స్' టోటల్ అదుర్స్ పుట్టించారానాడే! ఇప్పటికీ అశోక్‌కుమార్, కిషోర్ కుమార్, అనూప్ కుమార్‌లను ఆత్మీయంగా తలచుకొని మురిసిపోతూ ఉంటుంది ఒక తరం. 'చల్తీకా నామ్ గాడీ'లో 'తడిసిన సొగసరి' మధుబాలను మరిపించే మరో హీరోయిన్ ఇంత వరకు మళ్ళీ పుట్టలేదు అంటే అతిశయోక్తి కాకూడదు. ఆమె కిషోర్ కుమార్ జీవితంలోనూ పెనవేసుకుపోయిన సౌందర్య దేవత. దురదృష్టవశాత్తు వాళ్ళ జీవితంలో వాళ్ళు కోరుకున్నవి.. మనం ఊహించినన్ని నవ్వులు పువ్వులై గుభాళించలేదు.

గుండె జబ్బుతో లక్షలాది రసికులను కళ్ళనీళ్ళ పర్యంతం చేసి ఆవిడ వెళ్ళిపోయారు.

'పడోసన్' హిందీలోని మరో మాస్టర్ పీస్! తడారిన జీవితాల్లో నవ్వుల రసగుళికలు అందించి కితకితలు పెట్టిన గొప్ప మైలురాయి.

ఈ మధ్య 'కమెడియన్' అవసరం లేకుండా శరపరంపరలుగా హీరోలూ, హీరోయిన్‌లే 'కామెడీల పంట' పండిస్తున్నారు. అదీ వెండి తర మీద 'బంగారం' పండిస్తూ, మరీనూ! హిందీలో మెహమూద్ హాస్యానికి 'కిరీటం ధరించిన చక్రవర్తి'లా వెలిగిపోయాడు ఒక జమానాలో ! ఎంతో పేరున్న హీరోలు కూడా దడిసిపోయేలా 'సీన్ల'లో వెలిగిపోయే వాడు. 'సినీ స్టీలింగ్' అంటారు దాన్ని. ఆ దెబ్బకు కొందరు పెంపర్లాడి పోయి 'బాపరేꣳ!'-'బాబోయ్' అనుకొని 'మెహమూద్ వద్దు సార్!' అని సిగ్నల్స్ పంపేవారు.

ఆఖరాఖర్న మెహమూద్ నటనలో వెకిలితనం, కాస్తంత బజారుతనం వచ్చింది. ఇప్పుడు ఎంతో పేరున్న హీరో హీరోయిన్లు కూడా 'మింగుడు పడని' జర్క్లు ఇచ్చి దాన్ని 'హాస్యం' పేర్న ఖపాయిస్తున్నారు. అది కొందరికి నచ్చినా, చాలా మందికి ఇబ్బందిగానూ, ఎబ్బెట్టుగానూ అనిపిస్తోంది. కాని, బుద్ధిమంతుల మాట వినే 'బుద్ధి మంతులు' ఏరీ?.

'ప్రజలు కోరుకుంటున్నారు. అందువల్ల తప్పదు' అని నసుగుడు మన చిత్ర సీమను ఇంకా ఎంత భ్రష్టు పట్టించబోతుందో అర్థం కాదు.

సరే!

మనం కాస్త ఓపిక చేసుకొని 1961 ప్రాంతం 'హిందీ సినీ మాయానగరి'లోకి ప్రవేశిద్దాం. నిర్మాత - నిర్దేశకుడైన 'నాజర్ హుస్సేన్' ఒక 'సినిమా' అందించాడు.

ఎవర్‌గ్రీన్ హీరో - దేవానంద్'-నటన అంతగా జీర్ణించుకొని, చలాకీ డాన్సింగ్ హీరోయిన్ 'గ్లామర్ గర్ల్' - 'ఆశా పారేఖ్' నటించిన 'జబ్ ప్యార్ కిసీసే హోతాహై' సినిమా అది. శంకర్ జైకిషన్‌ల 'జబర్ దస్త్' సంగీతంలో, మొత్తం పదకొండు గీతాల్లో కనీసం తొమ్మిది ఇంకా జ్ఞాపకం చేసుకునే పాటలు. రెండు రిపీట్ సాంగ్స్. 'టైటిల్ సాంగ్'తో పాటు 'సౌసాల్ పహలే ముఝే తుమ్ సే ప్యార్ థా'... 'తెరీ జుల్ఫోంసే జుదాయీతో నహీ మాంగీ థీ'-'ఏ ఆంఖేꣳ ఉఫ్ యుమ్మా'..... 'తుమ్ జైసే బిగడే బాబూ సే మెం అఖియాꣳ బచావూꣳ'

లాంటి పాటలు నేటికీ వేల, లక్షల రసికులు ఆత్మీయంగా 'హమ్మింగ్' చేస్తూ ఉంటారు.

అందులో 'పోపట్‌లాల్' అని ఓ హాస్య పాత్రలో ఏకంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోయాడు 'రాజేంద్రనాథ్'. రాజేంద్రనాథ్, అలనాటి నటుడూ, మొన్నటి దేవానంద్ 'జానీ మేరా నామ్'లోని విలన్ పాత్రతో రెండో ఇన్నింగ్స్‌ను విజయవంతంగా సాగించిన ప్రేమ్‌నాథ్ తమ్ముడు రసికులకు షమ్మీకపూర్ ఆశాపారేఖ్‌ల 'మ్యూజికల్ థ్రిల్లర్' - 'తీస్రీ మంజిల్' ఇంకా జ్ఞాపకం ఉండే ఉంటుంది. అందులో 'ఓ మేరే సోనారే' లాంటి అందాల గీతాలు కుప్పలు తెప్పలుగా అందించాడు 'ఆర్.డి. బర్మన్'. అందులోనూ ప్రేమ్‌నాథ్ విలన్‌గా వేశాడు. దిగ్రేటెస్ట్ షో మ్యాన్ ఆఫ్ ఇండియన్ సినిమా- నీలికళ్ళ అందగాడు- భారతీయ చార్లీ చాప్లిన్ 'రాజ్ కపూర్' భార్య కృష్ణా వాళ్ళ సోదరి. వాళ్ళ నాన్నగారు మధ్యప్రదేశ్‌లోని 'రీవా' లో పోలీసు ఉన్నతాధికారి. అక్కడే 'దర్బార్ కాలేజ్'లో సైన్సు విషయంలో పట్టభద్రుడైన 'రాజేంద్రనాథ్' తొలి రోజుల్లో నాటకాల్లో చిన్న చిన్న పాత్రలేసి మురిసిపోయేవాడు. మెల్లగా 'ముంబాయి'లో సినీ జగత్తులో బాగా నాటుకు పోయిన అన్నయ్య 'ప్రేమ్‌నాథ్' చెంత చేరాడు. ప్రేమ్‌నాథ్‌కు అప్పటికే రాజ్‌కపూర్, షమ్మీకపూర్‌తో ఆత్మీయ సంబంధాలుండేవి. అలా ముంబాయి చేరుకున్న, ప్రేమ్‌నాథ్ పంచన చేరిన రాజేంద్రనాథ్-'పాపాజీ' (రాజ్‌కపూర్ తండ్రి, అలనాటి మహానటుడు, మొగల్-ఏ- ఆజమ్‌లో 'న భూతో న భవిష్యత్‌లా' షహెన్ షా-ఐ- అక్బర్' పాత్రలో జీవించిన 'పృథ్వీరాజ్ కపూర్' పేర్న పృథ్వి థియేటర్‌లో నాటకాలు సాగేవి. ఆయన్ను అందరూ ఆదరాభిమానాలతో 'పాపాజీ' అని పిలిచేవారు. పాపాజీ అంటే నాన్నగారూ అని అర్థం) గారి 'పృథ్వీ' థియేటర్‌లో చిన్నా, చితకా పాత్రలు వేయసాగాడు. ఆయన వెంటే యావత్ భారతదేశం 'నాటకాల ట్రూప్'తో తిరిగేడు. మెల్లమెల్లగా సినిమాల్లోనూ అవకాశాలు వచ్చి చేరాయి.

అయితే అవన్నీ చిటికెడు పాత్రలే. హిందీతో పాటు కొన్ని పంజాబీ, భోజ్‌పురి సినిమాల్లోనూ నటించాడు రాజేంద్రనాథ్.

1938లో అశోక్‌కుమార్ నటించిన 'వచన్' సినిమా ఆ రోజుల్లో పెద్ద హిట్. అందులో నటించిన రాజేంద్రనాథ్‌కూ అంతో ఇంతో గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత వచ్చాయి మరో పిడికెడు పాత్రల్లో వెలిగిన ఆయన రోల్స్... 'తహ్‌ఖానా' - 'పతంగా' - 'ఉస్నే కహా థా'- 'నౌకాడూబి అనే టాగోర్ నవల మీద 'ఘంఘట్' అనే సినిమా హిందీలో వచ్చింది. అయితే అవన్నీ చిటికెడూ పిడికెడూ పాత్రలే కాకుండా కాస్తంత గంభీరమైనవే!

1956లో అలనాటి మరో గొప్ప హాస్యనటుడు 'ఇంగ్లీషులో ఎమ్మే డిగ్రీ హోల్డరూ'

అయిన. ఐ.ఎస్. జోహార్ - 'రాజేంద్రనాథ్'కు మంచి పాత్ర నందించాడు. అది ఆయన తొలి హాస్యపాత్ర. అశోక్‌కుమార్ - జయవంత్‌లు నటించిన 'హమ్ సబ్ చోర్ హై'లోని ఆ పాత్ర వల్ల రాజేంద్రనాథ్‌కు హాస్యనటుడిగా కాస్తంత గుర్తింపు వచ్చింది.

ఆ తర్వాత వచ్చింది హెచ్.ఎస్. రావల్ 'షరావత్'లోని పాత్ర. అందులో నటించిన వాళ్ళు చిన్నవాళ్ళు కాదు. సిల్వర్ జూబ్లీ మేటి హీరో 'రాజేంద్రకుమార్'. అందాల టాలెంటెడ్ నటి 'మీనా కుమారి'. అలాంటి దిగ్గజాల మధ్యా ఒక్క వెలుగు వెలిగాడు 'రాజేంద్రనాథ్'.

ఆ తర్వాత 1961లో రాజేంద్రనాథ్ తిరుగులేని చరిత్ర రచించాడు. ఫిల్మిస్తాన్ వాళ్ళ సినిమా 'జబ్ ప్యార్ కిసీసే హోతాహై' వచ్చింది. నిర్మాత - దర్శకుడు నాజర్ హుస్సేన్ కీర్తి పతాకం యావత్ భారతదేశం నలు మూలల్లోనూ రెపరెపలాడించిన 'సదా బహార్ రొమాంటిక్ శ్వేతశ్యామ చిత్రం' అది. పాటలన్నీ హిట్. నేటికీ మళ్ళీ మళ్ళీ వినాలన్పించేంత మధురమైనవి. గొప్ప నటనా పాటవం లేకున్నా 'గ్లామర్ డాల్' లాంటి ఆశా పారేఖ్ అంటే జనం పడి చచ్చేవాళ్ళు. తర్వాతి రోజుల్లో 'కటీ పతంగ్'లో ఆవిడ నటించి కూడా ప్రసిద్ధులయ్యారు. అవార్డులూ అందుకున్నారు లెండి.

'జబ్ ప్యార్ కిసీసే హోతాహై'లో రాజేంద్రనాథ్ నటించిన 'పోపట్ లాల్' పాత్ర ఆద్యంతమూ అద్భుతమైన అవిస్మరణీయమైన నటనా పాటవం ఉన్న పాత్ర అని కాదు.

కాస్తంత తలా తోకా లేని వూకదంపుడు కామెడీ రోలే!

పెద్ద పెద్ద లావాటి కళ్ళద్దాలూ..... దుబ్బుగా పెరిగిన కను బొమ్మలూ... లావాటి వంకర తిరిగినపెదవులు అస్తమానం ఏదో గొణుగుతూ ఉంటాయి. అవతారం అంతే హాస్యాస్పదంగా ఉండేది. పెద్ద పెద్ద గళ్లకోటూ.... కింద మోకాలు దాకా వూగే నాడా...లూజ్‌గా , విశాలంగా ఉంటే చడ్డీ లాంటి నిక్కరూ... తడబడే బూట్ల అడుగులూ... మొహమ్మీద జాలి కల్పించేలా వెధవ చూపు... కాని, మెదడులో యమ (బోడి) ప్లానింగ్‌లూ....! అదీ 'పోపట్‌లాల్' పాత్ర.

రాజేంద్రనాథ్ అందులో దూరి మరీ జీవించాడు. ప్రజలు పొట్ట చేత పట్టుకొని, పడీ పడీ నవ్వారు. అలా నవ్వీ నవ్వీ జ్ఞాపకం ఉంచుకున్న 90 శాతం జనాలకు 'పోపట్‌లాల్' మాత్రమే జ్ఞాపకం ఉండిపోయాడు.

నాజిర్ హుస్సేన్ లాంటి తెలివైన 'నిర్మాత' జనం నాడి తెలిసిన వాడు. 'పోపట్‌లాల్' ఆయన సినిమాలన్నింటిలోనూ దాదాపు అదే రూపంలో దర్శన మిచ్చేవాడు.

రివల్యూషనరీ హీరో 'షమ్మీ కపూర్'తో రాజేంద్రనాథ్ ఎన్నో సినిమాల్లో నటించాడు. షమ్మీకపూర్ అంటే 'సినిమా హిట్' లేదా జబర్ దస్త్ హిట్'. రాజేంద్రనాథ్‌కు ఆ రకంగా 'విజయం' వేటాడింది. వెన్నంటి, ఎంతో పేరు సంపాదించి పెట్టింది.

'ఫిర్ వహీ దిల్ లాయా హూం'.... 'తీస్రీ మంజిల్' ...'బహారేం కే సప్నే'.... 'ప్యార్ కా మౌసమ్' లాంటి సినిమాలు హిట్ కావడం వల్ల రాజేంద్రనాథ్ 'కమర్షియల్ సక్సెస్ ఫుల్ కమెడియన్' బిరుదు సంపాదించుకున్నాడు.

అందువల్ల కొన్ని 'గంభీరమైన పాత్రల్లో నటించినా - ఆఖరుకు సునీల్‌దత్ 'ముఝే జీనే దో' లాంటి సినిమాల్లోని 'గంభీరమైన' పాత్రలకన్నా జనం ఆయన్ను హాస్య పాత్రల్లోనే చూడాలని కోరుకునే వారు.

'మొహేనఘూర్ కేదేఖ్' అనే లతా గీతం చాలా మంది రసికులకు జ్ఞాపకం ఉండకపోవచ్చు. కాని ఆ గీతం పై నాట్యం చేసిన 'డాన్సర్' పాత్ర రాజేంద్రనాథ్ వేసిందే అనే ముచ్చట ఆ తరం వారికి జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఆఖరాఖర్న 'ఫుల్ లెంత్ కామెడీ కాకున్నా మళ్ళీ చిటికెడూ, పిడికెడూ హాస్య పాత్రలకే పరిమితమై పోయాడు రాజేంద్రనాథ్. 'తుమ్ కరో వాదా' (1993)- 'ఎక్కా -రాజా- రాణీ- (94) లాంటి ఆఖరు రోజుల్లోని పాత్రలు ఎప్పుడు వచ్చి వెళ్ళాయో అన్నది కూడా చాలా మందికి తెలియదు. 'పరివార్'- 'పూరబ్ ఔర్ పశ్చిమ'- 'జీవన్ మృత్యు' జ్ఞాపకం ఉన్నా మరచిపోలేని పాత్ర... సదా బహార్ 'పోపట్‌లాల్' మాత్రమే!

'జాతస్యహి ధృవో మృత్యుః'.... పుట్టిన వాళ్ళు గిట్టక తప్పదు- శ్వాస వ్యాధితో ఇటీవల 13వ ఫిబ్రవరి 2008 నాడు- 76 సంవత్సరాల వయస్సులో రాజేంద్రనాథ్ తిరిగి రాని దూర తీరాలకు వెళ్ళిపోయాడు.

కాని, 'పోపట్‌లాల్' మన చెంతే ఉంటాడు.. సినిమా రీళ్ళల్లోంచి ఎప్పుడైనా వెండితెర మీద పిచ్చి వాలకం చూపులతో కదిలిపోతాడు. అప్పుడు పలకరించడం మరచిపోకండేం!!!

❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.

ఫోన్ : 08732223622



టొమేటో పలావ్

కావలసిన పదార్థాలు

బియ్యం- 1/2 కిలో, కొబ్బరి చిప్ప-1,ఉల్లిపాయలు-5, ఎండుమిర్చి- 10, దాల్చిన చెక్క ముక్కలు- 1,డాల్డా - 200 గ్రా॥, టొమేటోలు- 1/4 కిలో, పచ్చిమిర్చి- 8, అల్లం ముక్క-1, లవంగాలు- 1 చెంచా, మెంథాల్- 10 గ్రాములు

తయారు చేసే విధానం

బియ్యం కడిగి ఒక బుట్టలో వేయవలెను. టొమేటోలు, కొబ్బరి కోరు, ఎండు మిర్చి, అల్లం ఒక బాండీలో నూనె లేకుండా వేయించి మెత్తగా రుబ్బుకొని గిన్నెలో పెట్టాలి. కుక్కర్‌లో డాల్డా వేసి మషాలా దినుసులన్నీ వేసి బాగా వేగనివ్వాలి. తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఆరబోసిన బియ్యాన్ని కూడా బాగా వేయించాలి. తర్వాత అందులో మనం రుబ్బిన ముద్ద వేసి కలపాలి. మనం తీసుకొన్న బియ్యానికి ఒకటికి రెండింతలు నీళ్లు పోసి తగినంత ఉప్పు వేసి బాగా కలియపెట్టాలి. తుంచుకున్న పుదీనా ఆకులను పైన వేసి మూత పెట్టాలి. ఆనక కుక్కర్‌లో పెట్టి ఉడకనివ్వాలి.

గ్రేప్ జ్యూస్

కావలసిన పదార్థాలు

ద్రాక్ష పండ్లు- (నల్లనివి) 1/2 కిలో, నీళ్లు- 1/2 శేరు
ద్రాక్ష యెసెన్సు- 1 టీ స్పూను, పంచదార- 3/4 కిలో
నిమ్మ ఉప్పు- 4 టేబుల్ స్పూన్లు,
సోడియం- బెంజాయిటి- 1/4 స్పూను

తయారు చేసే విధానం

ద్రాక్ష పండ్లు తాజాగా ఉన్నవి తెచ్చుకోవాలి. అందులో బాగా మాగిన పండ్లు తీసి వేయాలి. వీటిని గిన్నెలో వేసి చేత్తో బాగా నలిపి వేయాలి. వీలైనన్ని గింజలు తీసి వేయాలి. కాసిని నీళ్ళు పోసి స్టౌ మీద పెట్టి కాస్త వెచ్చబడనివ్వాలి. వీటిని బాగా పిసికి పైతోలు, మిగిలిన గింజలు తీసివేయాలి. పంచదార పాకం పట్టుకొని దానిలో నిమ్మఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. చల్లారిన తరువాత రసంలో కలిపి సోడియం బెంజాయిటీ కొంచెం గోరు వెచ్చని నీటిలో కలిపి దానికి యెసెన్సును కలిపి పాకంలో కలిపి చల్లారిన తరువాత సీసాలో పోసుకోవాలి.



నువ్వుల పూర్ణాలు

కావలసిన పదార్థాలు

నువ్వు పప్పు- 1/4 కిలో, బెల్లం- 1/4 కిలోకి కొంచెం ఎక్కువ
మైదా పిండి - 1 గ్లాసు, బియ్యం పిండి- 2 గ్లాసులు
కొబ్బరి చిప్ప-1, నూనె- 1/2 కిలో

తయారు చేసే విధానం

నువ్వు పప్పు రాళ్లు లేకుండా శుభ్రం చేయాలి. దోరగా వేయించి, నువ్వులు, బెల్లం కొబ్బరి వేసి మెత్తగా దంచి నిమ్మకాయంత ఉండలు చేసి పక్కన పెట్టుకోవాలి. మైదా, బియ్యం పిండి శుభ్రం చేసి కొంచెం ఉప్పు, పంచదార వేసి గరిటజారుగా కలుపుకోవాలి. స్టౌ మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. తరువాత ఈ ఉండలను పిండిలో ముంచి దోరగా వేయించి ఉయ్యండి. ఇవి వారం వరకు నిల్వ ఉంటాయి.

మిక్చరు

కావలసిన పదార్థాలు

శనగపిండి- 2 డబ్బాలు, మైదా పిండి - ఒక కప్పు
వేయించిన శనగ పప్పు- డబ్బా, మిఠాయి రంగులు-3 రకాలు
ఉప్పు -సరిపడా, బియ్యం పిండి- ఒక డబ్బా, అటుకులు- 1 డబ్బా
చిన్న చిన్న బిస్కట్లు- 100 గ్రాములు, నూనె - 3/4 కిలో,
కారం- 2 టేబుల్ స్పూన్లు

తయారు చేసే విధానం

శనగ పిండి, బియ్యం పిండి కలిపి జల్లించాలి. అందులో కొంచెం ఉప్పు వేసి సగం పిండిని ముద్దలాగా కలుపుకోవాలి. ఈ పిండిలో ఒక రంగు కలుపుకోండి. ఇవి సన్న కారప్పూసలాగా కొంచెం లావు కారప్పూసలాగా కొంచెం వత్తండి. ఇవి చిన్నగా చితిపి ఒక బేసిన్‌లో పోయండి. అలాగే మిగిలిన పిండిలో ఇంకో రంగుతో బూంది పిండి మాదిరి కలిపి చిన్న చిన్న బెజ్జముల అపకతో బూందీ తీయండి. ఇవి కూడా దానిలో కలిపి పెట్టండి. తర్వాత మైదా పిండిని పూరీ పిండిలాగా కలుపుకోవాలి. పల్చగా పూరీ చేసి దానిని క్రాస్‌గా చిన్న చిన్న డైమండులాగా కోసి ఇవి కూడా నూనెలో వండి వాటిలో పోయండి. ఇవన్నీ కలిపితే మిక్చరు తయారవుతుంది.



కాబోయే భర్తకు రాబోయే ఉద్యోగం....
అమ్మాయికి వస్తుందా?

మా అన్నయ్య కూతురికి జూన్ 2007 సంవత్సరంలో పూలు, పండ్లు పెట్టుకున్నాం. అబ్బాయివాళ్ల నాన్నగారు గవర్నమెంట్ ఉద్యోగం చేస్తూ సర్వీస్‌లో ఉండగానే చనిపోయారు. ఆ జాబ్ ఆ బాబుకి ఇవ్వడానికి అంతా పూర్తయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత మ్యారేజ్ చేసుకుందామని పూలు, పండ్లు పెట్టుకున్నారు. అమ్మాయి బి.ఎ. ఫైనల్ ఇయర్ చదువుతోంది. అనుకోకుండా అబ్బాయిని ఎవరో హత్య చేశారు. ఈ విషయం అమ్మాయికి తెలియదు. ఫైనలియర్ పరీక్షలు జరుగుతున్నాయి కనుక మేము చెప్పలేదు. పరీక్షలు అయ్యాక చెపుతాము. అబ్బాయి తరపు బంధువులు ఎవరూ లేరు. నాయనమ్మ మాత్రమే వుంది. అసలు విషయం ఈ రెండు మూడు నెలల్లో అబ్బాయికి జాబ్ వస్తుంది. మరి అబ్బాయి లేదు కదా! ఎంగేజ్‌మెంట్ అయిన ఈ అమ్మాయికి జాబ్ వస్తుందా? ఒక వేళ వచ్చే అవకాశం ఉంటే ఎవరిని కలవాలి? ఎప్పుడు కలుసుకోవాలి? తెలుపగలరు.

హత్య కాబడిన అబ్బాయికి ఒక స్నేహితుడు ఉన్నాడు. మొదటి పెళ్ళి చూపులకు, ఎంగేజ్‌మెంటుకు కూడా అతని వెంట వచ్చాడు. అతని అక్కయ్యకు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారట. అయితే ఆ ఇద్దరినీ చెరొకరు చేసుకుందాం అని అడిగాడట. అది కూడా ఉద్యోగం వస్తుంది అని తెలిసిన దగ్గర నుండి. అతని అక్క కూతుర్ని చేసుకోమని అబ్బాయిని విసిగించాడు. ఉద్యోగం రాగానే ఎంగేజ్‌మెంట్ అయిన అమ్మాయినే వివాహం చేసుకుంటానని చెప్పాడు. మాది ఖమ్మం జిల్లా, అబ్బాయిది గుంటూరు జిల్లా. అబ్బాయి దూరపు బంధువులు కావడం వలన మా అమ్మాయిని తక్కువ కట్నానికే పెళ్ళిచేసుకోవడానికి ఒప్పుకున్నాడు. అతని స్నేహితుడే ఈ హత్య చేసివుంటాడని అతనిని అరెస్ట్ చేసి స్టేషన్లో పెట్టారు. కాని పదిహేను రోజులు కావస్తున్నా నిజమైన ఆధారాలు దొరకలేదు. ఈ పనికి పూనుకున్న వ్యక్తులను పట్టుకోలేదు. దీనిని బట్టి అక్కడి వాళ్ళ పలుకుబడితో శిక్షనుండి తప్పించుకుంటాడేమో. మాకు అక్కడ ఎవరూ తెలియదు. ఇంత దారుణానికి పాల్పడ్డ వాళ్ళకి ఎలా శిక్షపడుతుంది? తెలుపగలరు.

వి. శాంతాకుమారి, ఖమ్మం.

మీరు చెప్పిన పరిస్థితి చాలా బాధ కలిగిస్తుంది. జరిగింది హత్య కాబట్టి దీనిని పోలీసులే పరిశోధించాల్సి ఉంటుంది. హంతకుల మీద చర్యలకు పోలీసులను సంప్రదించాల్సి ఉంటుంది. మీ అనుమానం వారి వద్ద కూడా తెలియజేయండి. ఉద్యోగం ఇంకా ఆ వ్యక్తికే రాలేదు. ఆ వ్యక్తికి పెళ్లి కాలేదు. కావున, ఈ అమ్మాయికి రాదు, ఎంగేజ్‌మెంట్ అయినంత మాత్రాన అది పెళ్లి అయినట్లు కాదు. కావున ఉద్యోగం ఈ అమ్మాయికి రాదు. ఆ అమ్మాయికి విషయం తెలియజేయండి. లేందటే విషయం పరోక్షంగా తెలుసుకుంటే డిప్రెషన్‌కు గురి అయ్యే ప్రమాదం ఉంది.

పాఠకులకు
మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవు తున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.మా

చిరునామా:

ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం,
స్ట్రీట్ నెంబర్: 1,
అశోక్ నగర్,
హైదరాబాద్ - 500 020.

పుట్టినరోజు గొడవ

మా పాప పుట్టిన తేది 10.1.95. ఏడవ తరగతి పరీక్ష రాయటానికి వయస్సు సరిపోదని పుట్టిన తేదీని 10.8.94 గా డాక్టరు సర్టిఫికెట్ తీసుకొని పరీక్ష రాయించటం జరిగింది. విద్యాశాఖ అధికారుల నుండి ఎటీ సర్టిఫికేషన్ పొందవచ్చని తెలిసి కూడా అప్పటి పరిస్థితుల్లో ఆ పని చెయ్యలేక పోయాను. ఇప్పుడు మా పాప తొమ్మిదవ తరగతి చదువుతున్నది. జనన మరణాల శాఖనుండి 10.1.95గా పొందిన సర్టిఫికెట్ కూడా ఉంది. 10వ తరగతిలోకి వచ్చాక అసలు పుట్టిన తేదీతో పరీక్ష రాయాలంటే ఏం చేయాలి?

ఒక ఉద్యోగి, ఏలూరు.

మీరు మీ దగ్గరలోని కోర్టులో మీ వద్దనున్న పత్రాల ఆధారంగా డిక్లరేషన్ కరెక్షన్ ఆఫ్ డేట్ ఆఫ్ బర్త్ కోసం దావా వేయండి. మీరు పాఠశాల యాజమాన్యంను పార్టీగా చేయండి. 10వ తరగతి పాసై ఉంటే ఎస్ఎస్‌సి బోర్డుని కూడా ప్రతివాదులుగా చేయవలసి ఉంటుంది.



జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది, 9848994240

... నిలయం

కొత్త పుస్తకాలు

గ్రూప్ పరీక్షార్థులకు వరప్రసాదాలు









ఎ.పి.పి.ఎస్సీ, గ్రూప్ - 1 & 2 పరీక్షలను కొత్త సిలబస్, కొత్త రూపంతో నిర్వహిస్తున్నారు. సిలబస్‌లోని అంశాలను చూస్తే తెలిసినవిగానే ఉంటాయి. ఫలానా విషయానికి సంబంధించినది ఇది అని అర్థమవుతుంది. కానీ సమగ్ర సమాచారం మాత్రం దొరకడం లేదు. ప్రస్తుత పరీక్షలకు ప్రిపేరవుతున్న ప్రతి విద్యార్థికీ ఎదురవుతున్న 'కామన్' సమస్య ఇది. అందుకనే వారు మార్కెట్‌లో దొరికే అన్ని రకాల పుస్తకాలనూ కొంటున్నారు. అయితే వీటిలో చాలా పుస్తకాలు వాసిలోనే తప్ప రాసికి అందడం లేదు. అవన్నీ చూసి, చదివి తీరా ఏమీ లేదనే విషయం తెలుసుకునేందుకు కొద్దిగా సమయం పడుతుంది. కీలకమైన ఈ సమయంలో ఇది అత్యంత వృధాప్రయాస.

దీని నుంచి వారిని తప్పించేందుకు ప్రజాశక్తి బుక్ హౌజ్ ప్రత్యేకమైన కృషి చేస్తోంది. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఆయా రంగాల్లో నిపుణులైన వారితో ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను రాయించింది. పరీక్షలకు అవసరమైన కోణంలో దానిని పొందు పరిచి పుస్తకాలుగా అందిస్తోంది. బయట ఎక్కడా దొరకని సాంస్కృతిక చరిత్ర, తెలంగాణా సాయుధ పోరాటం, భూసంస్కరణలు, సామాజిక సమస్యలు వంటి సబ్జెక్టులను ఈ కోణంలో పుస్తకాలుగా పరీక్షార్థులకు అందిస్తోంది. ఈ పరంపరలో భాగంగా ఇటీవల మార్కెట్‌లోకి 'సమగ్ర భారత చరిత్ర' పేరుతో నాలుగు వాల్యూముల సెట్‌ను విడుదల చేసింది. 'గ్రూప్' పరీక్షార్థులకు అవసరమైన సాంస్కృతిక, సామాజిక చరిత్ర పేపరుకు అవసరమైన సమగ్ర మెటీరియల్ ఇందులో ఉంది. దీనిని రాసిన వారు కె. కృష్ణారెడ్డి. పోటీ పరీక్షల రంగంలో దాదాపు రెండు దశాబ్దాల అనుభవం కలిగి ఉన్న ఈయన ఈ సబ్జెక్టులో ఒక 'అథెంటిసిటీ'. అందుకే ఆయన ఇంగ్లీషులో రాసిన పుస్తకాలు దేశవ్యాప్తంగా పోటీ పరీక్షలు రాస్తున్న వారికి విజయాన్ని చేకూరుస్తున్నాయి. న్యూఢిల్లీలో ఐ.ఏ.ఎస్. స్టడీ పాయింట్ వ్యవస్థాపకుడైన ఈయన తన బోధనానుభవంతో రాసిన ఇవి పరీక్షార్థులకే కాకుండా యూనివర్సిటీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌గానూ, రిఫరెన్స్ పుస్తకంగానూ పేరు పొందాయి. ఇంతటి ప్రామాణిక సమాచారయుతమైన 'సమగ్ర భారత చరిత్ర'ను... 1. సమగ్ర భారత చరిత్ర : ప్రాచీన యుగం, 2. సమగ్ర భారత చరిత్ర : మధ్య యుగం, 3. సమగ్ర భారత చరిత్ర : జాతీయోద్యమం, 4. సమగ్ర భారత చరిత్ర : ఆధునిక యుగం ... అని నాలుగు వాల్యూములుగా అందించారు. భారతీయ అలిఖిత చరిత్ర నుంచీ మొదలుకుని స్వాతంత్ర్యానంతరం దేశంలో తలెత్తిన ఉద్యమాల దాకా వాల్యూముల్లోని విషయగత అంశాలు వేటికవే ప్రత్యేకంగా ఉన్నాయి.

ఒక్కొక్క విషయానికి చెందిన విషయాలను సమగ్రంగా అంశాల వారీగా పొందుపరిచిన తీరు చదవడానికి ఆసక్తి కరంగానూ, సులభంగా అర్థమయ్యే విధంగానూ ఉన్నాయి. చదివిన దానిని గుర్తుంచు కునేందుకు వీలుగా పొందుపరిచిన తీరు పరీక్షార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది. సింధు నాగరికత నుంచీ మొదలుకుని నేటి దాకా ఉన్న ప్రతి విషయాన్నీ చార్టుల రూపంలోనూ, మ్యాపుల రూపంలోనూ వివరించారు. చరిత్రను ఈ విధంగా విపులంగా సులభ గ్రాహ్యరీతిలో అందించడం వీటి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అందుకని ఈ పుస్తకాలు పరీక్షార్థులకు అవసరమైనవిగా ఉన్నాయి. పరీక్షా కోణంలోనూ, ఇతరత్రానూ ప్రామాణికమైన ఈ పుస్తకాలు ప్రతి పరీక్షార్థి వద్దా ఉండడం తప్పనిసరి అని చెప్పవచ్చు.

1. సమగ్ర భారత చరిత్ర : ప్రాచీన యుగం (పేజీలు : 352. చార్టులు, మ్యాపులు వెల : రు. 150), 2. సమగ్ర భారత చరిత్ర : మధ్య యుగం (పేజీలు : 393. చార్టులు, మ్యాపులు వెల : రు. 150), 3. సమగ్ర భారత చరిత్ర : జాతీయోద్యమం(పేజీలు : 222. చార్టులు, మ్యాపులువెల : రు. 100), 4. సమగ్ర భారత చరిత్ర : ఆధునిక యుగం (పేజీలు : 250. చార్టులు, మ్యాపులు వెల : రు. 100), ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌజ్, ఇ.నెం.1-1-187/ 1/ 2, చిక్కడ పల్లి, హైదరాబాద్ - 500 020. ఫోన్ నెం. 2766 0013తో పాటు ప్రజాశక్తి అన్ని బ్రాంచిలు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన పుస్తక షాపులు, బుక్‌స్టాళ్ళలో పుస్తకాలు లభిస్తాయి.

నేలంటి మధు

భావ రాజీవం

కవితా సంపుటి

కె. రాజకుమారి

వెల:70/-, పేజీలు:76

ప్రతులకు:

అన్ని పుస్తక షాపులు.

కె.కె. సంజీవరావు, 79-23-2/1,

కళ్యాణసౌధ, జెన్ రోడ్, రాజమండ్రి.

అఖిల భారత సినీ ప్రేక్షక

వినియోగదారుల సంఘం

ఆంధ్రప్రదేశ్ విభాగం

గుండ్లపల్లి లక్ష్మీనరసింహారావు

వెల: అమూల్యం, పేజీలు: 56

ప్రతులకు:

అఖిల భారత సినీ ప్రేక్షక వినియోగదారుల సంఘం,

కేంద్ర కార్యాలయం, ఇం.నెం. 3-4-778,

బర్కత్‌పుర, హైదరాబాద్









ఆర్ట్ పీస్!

జిరాఫీ..ఏనుగు.. .నెమలి... కుందేలు... కుక్క... అస్తిపంజరం... బల్ల.. కుర్చీ... నీళ్లపంపు... ఆకారాల్లో కనిపిస్తున్న వీటిని చూస్తుంటే ఏమనిపిస్తోంది?! వాటి శరీరభాగాలను ఎక్కడో...ఎప్పుడో...లీలగా చూసినట్టు అనిపిస్తోందా. బాగానే క్యాచ్ చేశారుగానీ...ఇంతకీ అవి ఏమై వుంటాయి? తుపాకులు, మెషీన్‌గన్‌లను ముక్కలు చేసి ఇలా అతికించినట్టుందా...! మీ బుర్రా బాగానే పనిచేస్తోందే. సరిగ్గా ఇవి వాడిపడేసిన ఆయుధాల పీసులే. ఎక్కడ...ఎప్పుడంటారా! అయితే అర్జంటుగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లాల్సిందే! కంబోడియాలో ఇది వరకు 30 సంవత్సరాలకు పైగా అంతర్యుద్ధం జరిగిందిలెండి. 1998లో కంబోడియన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా...125,000 ఆయుధాలను నాశనం చేసింది. వాటి పీసులనే ఇలా కళాఖండాలుగా తయారుచేశారు. అదన్నమాట ఆర్టు పీసుల సంగతి.





బంగారు చేప

కె.సాహిల్

ఓ జాలరి, అతని భార్య సముద్ర తీరాన నివసిస్తుంటారు. ప్రతి రోజూ సముద్రానికి వెళ్లి చేపలు పడితేనే తిండి. లేకపోతే పస్తులే. ఎప్పటిలాగే ఆరోజు కూడా చేపల వేటకు వెళ్లాడు జాలరి. వల వేసి ఆశగా చూడసాగాడు. అలా సమయం గడిచిపోతోందేకానీ... ఒక్క చేప కూడా పడడంలేదు. అయినా సరే ఓపిగ్గా కూర్చుని చూడసాగాడు. ఎప్పటికో సాయంత్రానికి ఒక పెద్ద చేప పడినట్టుంది. వలను కూడా లాక్కుపోసాగింది. జాలరి తన బలాన్నంతా ఉపయోగించి బయటకు లాగాడు. అందులో వున్న చేపను చూసి ఆశ్చర్యపోయాడు.

ఆ చేప బంగారు వర్ణంలో మిలమిలా మెరిసిపోతోంది. పైగా మాట్లాడుతోంది.

"ఓ జాలరీ! నేను ఈ సముద్రంలో వున్న చేపల రాజు కొడుకును. మా భటుల కళ్లుగప్పి సముద్రం చూద్దామని వచ్చి ఇలా ఇరుక్కున్నాను. నేను వెళ్లకపోతే ఇంట్లో కంగారుపడతారు. దయచేసి నన్ను వదిలిపెట్టు. నేను ఇంటికి వెళ్లిపోతాను..." అని వేడుకుంది.

పాపం దాని అభ్యర్థన విని కరిగిపోయాడు జాలరి. సరేనంటూ...నీళ్లల్లోకి వదిలాడు చేపపిల్లను. వెంటనే అది ఈదుకుంటూ వెళ్లిపోయింది.

బంగారు చేపను చూశాక, దాని మాటలు విన్నాక జాలరికి ఒక్క క్షణం కూడా అక్కడ వుండబుద్ధి కాలేదు. వెంటనే ఇంటికి బయలుదేరాడు. జరిగిన సంగతంతా భార్యకు చెప్పాడు. ఆమె వెంటనే భర్తమీద ఇంత ఎత్తున ఎగిరిపడింది.

"నీకు తెలివి లేదు. ఆ చేప నిన్ను నీళ్లల్లోకి వదిలిపెట్టమని బతిమాలిందే అనుకో. వెంటనే తలాడించేసి వదిలేస్తావా! మనం ఇక్కడ ఇంత పేదరికంలో బతుకుతున్నామే! అందులోంచి బయటపడదామనే బుద్ధీ జ్ఞానం కాస్తయినా వుండాలి కదా. దాన్ని ఏదో ఒకటి కోరితే మన దరిద్రం వదిలిపోయేది కదా" అంది కోపంగా.

జాలరి పాపం విచారంగా మొహం పెట్టి...'నిజమే...అయితే ఇప్పుడు నన్నేం చేయమంటావ్?" అనడిగాడు.

"వెంటనే సముద్రం దగ్గరకు వెళ్లి చేపను పిల్చి మనకు ఒక మంచి ఇంటిని ప్రసాదించమని కోరుకో పో..." అంది.

భార్య చెప్పినట్టుగానే జాలరి సముద్రపు ఒడ్డుకు వెళ్లి..."ఓ బంగారు చేపా! నేను వేటాడి మళ్లీ నీళ్లల్లోకి వదిలిపెట్టిన చేపా! ఓసారి బయటకు రావా? నా భార్య నిన్ను నీళ్లల్లోకి వదిలిపెట్టినందుకుగాను ఏదో ఒక వరం కోరుకోమని చెప్పింది. ఇస్తావా.." అనడిగాడు దీనంగా.

బంగారు చేప నీళ్లమీదకు వచ్చి..."జాలరీ! నువ్వా... ఏం కావాలో కోరుకో...ఇచ్చేస్తాను" అంది.

"నాకు కాదు కానీ నా భార్య ఒకటేమని పోరుతోంది. ఆమెకు ఒక మంచి ఇల్లు కావాలంట..."

"పో...నువ్వు వెళ్లేసరికి నీ భార్య మంచి ఇంటి తలుపు దగ్గర నిలబడి నీకోసం ఎదురుచూస్తుంటుంది" అంటుంది చేప.

జాలరి ఇంటికి వెళ్లేసరికి నిజంగానే చేప చెప్పినట్టే జరిగింది. భార్య తన కోసం ఎదురుచూస్తోంది. అదీ పెద్ద ఇంటి ముందర. చాలా సంతోషించాడు జాలరి.

జాలరి భార్య కూడా బాగానే సంతోషించింది. కానీ ... కొద్ది రోజులయ్యాక మళ్లీ గొణగడం మొదలెట్టింది.

"ఏం ఇల్లు ఇది. ఇంటి ముందు ఒక నీటి బుగ్గ లేదు. ఇంటి వెనక తోట లేదు. వెంటనే వెళ్లి ఆ బంగారు చేపను ఇవన్నీ కూడా ఇవ్వమని అడుగు" అంది కోపంగా.

జాలరి వెళ్లి చేపను పిల్చి...అవన్నీ అడిగాడు. చేప ప్రత్యక్షమై...

"జాలరీ నాకు స్వేచ్ఛ ప్రసాదించిన మంచి మనిషివి నువ్వు. నీకు సాయం చేయకుండా వుంటానా! నీ భార్య కోరుకున్నట్టుగానే అన్నీ వుంటాయి. ఇంటి ముందర నీళ్ల బుగ్గ...ఇంటి వెనక తోటలో రకరకాల పూల మొక్కలు, పళ్ల చెట్టు... పెంపుడు జంతువులు...అన్నీ వుంటాయి. వెళ్లి చూడు..." అంటుంది.

జాలరి ఇంటికి చేరుకునేసరికి నిజంగానే అన్నీ కనిపిస్తాయి. జాలరి సంతోషిస్తాడు. అలా కొద్ది రోజులు గడుస్తుంది. తర్వాత భార్య మళ్లీ గొడవ చేయడం మొదలెడుతుంది.

"నాకు ఇంటి నిండా పనివాళ్లు వుండాలి. ఇంటి ముందు సైనికులు కాపలా వుండాలి. అసలు నేను మహారాణిలాగా వుండాలి. నువ్వు మహారాజులాగా వుండాలి. పో... వెళ్లి ఆ బంగారు చేపను అడిగిరా పో." అంటూ భర్తను పంపిస్తుంది.

జాలరి మళ్లీ కాళ్లీడ్చుకుంటూ సముద్రపు ఒడ్డుకు వెళతాడు. అక్కడ మోకాళ్లమీద కూర్చుని ...దీనంగా... చేతులు చాచి..."ఓ బంగారు చేపా! ఇప్పటికి నువ్వు నాకు చాలా ఇచ్చావు. చాలా సంతోషంగా వుంది. కానీ నా భార్యకు సంతోషం లేదు. తృప్తి లేదు. ఇంకా ఏవేవో కావాలని నా ప్రాణాలు కొరుక్కు తింటోంది. నువ్వే దాని బారి నుంచి నన్ను కాపాడాలి. ఇంటి నిండా పనివాళ్లుండాలంట... ఇంటి ముందు కాపలా సైన్యం వుండాలంట. ఒక రాజ్యం కావాలంట. వచ్చి దాని కోరికలు తీరుస్తావా?' అంటాడు.

అన్నదే తడవుగా...బంగారు చేప నీళ్లల్లోంచి బయటకు వచ్చి..."అర్థమైంది జాలరీ. నీవు మంచి వాడివే. కానీ నీభార్యకే కాస్త ఆశ ఎక్కువ. పోనీలే పాపం. నువ్వేం చేస్తావు. వెళ్లు ఆవన్నీ వుంటాయి. సంతోషంగా జీవించు పో..." అని పింపిస్తుంది చేప.

ఇంటికి వచ్చేసరికి ఇంటి స్థానంలో పెద్ద కోట కనిపిస్తుంది. సైన్యం, పనివాళ్లతో కోట కళకళలాడుతుంటుంది. భార్య మహారాణి వస్త్రాలలో సంతోషంతో వెలిగిపోతుంటుంది. తను ఇప్పుడు ఒక రాజ్యానికి రాజుని. భార్య రాణి. అది చూసి జాలరి కూడా ఆనందపడ్డాడు.

తర్వాత కొద్ది రోజులకు జాలరి భార్య మళ్లీ గొణగడం మొదలెడుతుంది. "ఛీ! నేను ఇంత బుల్లి రాజ్యానికే రాణినయ్యాను. కానీ సూర్యుడు, చంద్రుడు కూడా నేను చెప్పినట్టే వినాలి. వారిని కూడా నేనే పరిపాలించాలి. పో వెళ్లి బంగారు చేపను ఈ కోరిక కూడా తీర్చమని అడుగు..." అని పంపిస్తుంది.

జాలరి ఎంతో అయిష్టంగా సముద్రపు ఒడ్డుకు వెళ్లి..."ఓ బంగారు చేపా! దురాశపరురాలైన నా భార్య మరింత రెచ్చిపోతోంది. నువ్వేమో తను అడిగిన కోరికలన్నీ కాదనకుండా తీరుస్తున్నావు. ఇప్పుడు ఏకంగా సూర్యచంద్రులనే ఏలాలనుకుంటోంది...నాకు అడగడానికి నోరు రావడంలేదు. నువ్వే ఏదో ఒకటి చెయ్యి..." అంటాడు.

బంగారు చేప నీళ్లల్లోంచి బయటకు వచ్చి....'జాలరీ నీ భార్య కోరిక తీరుతుంది. నువ్వు ఏమాత్రం దిగులుపడకుండా ఇంటికి వెళ్లు..." అంటుంది తమాషాగా కళ్లార్పుతూ...

జాలరి సంతోషంగా ఇంటికి వచ్చేసరికి ఏముంది! తన రాజ్యం...కోట...సైన్యం...పనివాళ్లు.... ఎవరూ కనిపించరు... కోట స్థానంలో...పాత పూరి గుడిసె... గతంలో ఎందులో అయితే నివసించేవారో అది కనిపిస్తుంది. భార్య ఎప్పటిలా చిరిగిన బట్టలు వేసుకుని వుంటుంది. అది చూసి పెద్దగా నవ్వుతాడతను. అందుకు భార్యకు కోపం వచ్చి...

"ఏం! అలా నవ్వుతావెందుకు? ఆ చేప చచ్చిందా ఏంటి? మనకు వచ్చిన ఆస్తులన్నీ పోయాయి?" అనడుగుతుంది చిరాగ్గా.

"లేదు లేదు...ఆ చేప నువ్వు చివరిగా అడిగిన కోరికను కూడా తీర్చిందే పిచ్చిమొహమా. నువ్వు సూర్య చంద్రులను పాలించాలనుకున్నావు. ఇదిగో ఇప్పుడు పగలు కాబట్టి మన ఇంటి పైకప్పు రంధ్రాలలోంచి సూర్యుడు ఇంట్లో కనిపిస్తున్నాడు. చీకటి పడ్డాక అవే రంధ్రాలలోంచి చంద్రుడు కూడా ఇంట్లోకి వస్తాడు. అంటే నీ కోరిక తీరినట్టేగా. వారిద్దరూ నువ్వు చెప్పినట్టు వింటున్నట్టేకదా...." అని పడి పడి నవ్వుతాడు.